www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
20 నిర్మల్
మంగళవారం 22 ఆగస్టు 2017



కదిలికి పోటెత్తిన భక్తులు



కదిలిలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

- శ్రీ కదిలి పాపహరేశ్వస్వామి ఆలయానికి సోమవారం పోటెత్తిన భక్తులు
- కలిసివచ్చిన శ్రావణ చివరి సోమవారం, సోమావతి అమావాస్య
- పవిత్ర గోముఖ గుండంలో స్నానమాచరించి స్వామి వారి సర్వదర్శనం

4


8

తొలగనున్న దీపం-జాప్యం



- మంజూరు చేసే అధికారం తహసీల్దార్‌లకే
- ఎంపీడీవోల నుంచి తప్పించిన ప్రభుత్వం
- సమావేశాల ఏర్పాటుకు కసరత్తు
- ఇక రాజకీయ ప్రమేయం ఉండదంటున్న నిపుణులు

DEEPAM SCHEME
Department of Consumer Affairs, Food & Civil Supplies
Government of Telangana




పేద బలహీనవర్గాల కొరకు పంపిణీ చేసే దీపం పథకంలో విప్లవాత్మక మార్పులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయబోతున్నాయి. ఈ మేరకు గతంలో ఎంపీడీవోల ద్వారా దీపం పథకం ద్వారా లబ్ధిదారులను ఎంపిక బాధ్యత నిర్వహిస్తుండగా.. తాజాగా పౌర సరఫరాల శాఖ ఆయా మండలాలకు చెందిన తహసీల్దార్‌లకు దీపం పథకం లబ్ధిదారులను ఎంపిక చేసే బాధ్యతను అప్పగించింది. దీపం పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు గ్యాస్ సిలెండర్‌ల మంజూరులో తీవ్ర జాప్యం జరిగేది. ఇక ఆ సమస్య తొలగిపోనుందని అధికారులు అంటున్నారు.

ఆంధ్రజ్యోతి, నిర్మల్

దశ మారనున్న కుంటాల

- రూర్బన్ మిషన్ పథకానికి ఎంపిక
- మండల అభివృద్ధికి భారీగా నిధులు
- గ్రామాలలో పట్టణ తరహా వసతులు
- 24న అధికారులకు శిక్షణ



కుంటాల మండల కేంద్ర ముఖచిత్రం

దొరికిన తొమ్మిదో విగ్రహం

- బాసర ఆలయ ఉత్సవ విగ్రహంపై వీడిన ఉత్కంఠ
- సీజ్‌చేసిన రెండు బీరువాల తాళాలను పగులగొట్టి, పంచనామా
- పండితుడి బీరువాలోనే లభ్యం
- రికార్డులో లేని విగ్రహం



9





భక్తి శ్రద్ధలతో పొలాల అమావాస్య

వివరాలు లోపలి పేజీల్లో

ఇంటర్వ్యూ I.N.T.E.R.V.I.E.W

ఉద్యాన పంటలకు సబ్సిడీపై పరికరాలు

- జగన్‌మోహన్‌రెడ్డి, ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి, మంచిర్యాల జిల్లా



మందమర్రి : జిల్లాలో ఉద్యాన పంటలకు సబ్సిడీపై పరికరాలు అందజేస్తున్నామని జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. వాణిజ్య పంటల సాగు వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు పట్టు పరిశ్రమపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ విశేషాలు..

ప్ర : ఉద్యానవన శాఖ ద్వారా జిల్లాలో ఏయే తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నారు?

జ : ఉద్యానవన శాఖ కింద మామిడి, దానిమ్మ, యాపిల్‌బేర్, జామ, సుగంధద్రవ్యాలు, కూరగాయలు, పూలతోటల సాగును ప్రోత్సహిస్తున్నాం. ఈ పంటల సాగు రైతులకు లాభసాటిగా ఉంటుంది. పెట్టుబడి తక్కువ దిగుబడి ఎక్కువ అని చెప్పవచ్చు. ఏటా ఈ పంటల వల్ల లాభాలు వస్తూనే ఉంటాయి. జిల్లాలో చాలా మంది రైతులు ప్రస్తుతం పండ్లు, పూలతోటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

ప్ర : జిల్లాలో రైతులు ఎన్ని ఎకరాల్లో పండ్లతోటలు, కూరగాయలు సాగుచేస్తున్నారు?

జ : జిల్లా రైతులు 16 వేల ఎకరాల్లో మామిడి, 150 ఎకరాల్లో ఇతర పంటలు, 1200 ఎకరాల్లో కూరగాయలు, 4వేల ఎకరాల్లో సుగంధద్రవ్యాలు సాగు చేస్తున్నారు. ఈ పంటలను ఎలా పండించాలో, ఎలాంటి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలో ఎప్పటికప్పుడు సూచిస్తున్నాం. చాలామంది రైతులకు వాణిజ్య పంటలపై పూర్తిస్థాయిలో అవగాహన వస్తున్నది.

ప్ర : ఏయే పంటలు అధిక విస్తీర్ణంలో పండిస్తున్నారు?

జ : జిల్లాలో మామిడి మొదటి స్థానంలో ఉండగా పసుపు, మిర్చి, కూరగాయలు, పూల తోటలు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇతర పంటలు సాగుకు కూడా జిల్లాలో భూములు అనుకూలంగా ఉన్నాయి. ప్రతి ఒక్కరూ నీరు, మట్టి పరీక్ష చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ రెండింటినీ పరీక్షించాలక ఆ భూమిలో ఏయే పంటలు సాగుచేస్తే దిగుబడి అధికంగా వస్తుందో తెలియజేస్తాం.

ప్ర : ఉద్యాన పంటలకు ఎలాంటి సాయం అందజేస్తున్నారు?

జ : ప్రధానంగా మామిడి, ఇతర పంటలు సాగు చేసే ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీ, బీసీలకు 90 శాతం, ఐదెకరాలు ఉండే ఓసీ రైతులకు 90 శాతం సబ్సిడీతో తెలంగాణ రాష్ట్ర సూక్ష్మ నీటిసేద్య పథకం(టీఎస్ఎంఐటీ) కింద డ్రిప్, మైక్రో ఇరిగేషన్ పరికరాలు అందజేస్తున్నాం. రైతులకు సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాకే సబ్సిడీ మంజూరు చేస్తున్నాం.

ప్ర : ఇప్పటివరకు ఎంత మేర సబ్సిడీ అందజేశారు?

జ : ఇప్పటి వరకు 750 హెక్టార్లలో పంటలకుగాను దాదాపు రూ.5 కోట్ల సబ్సిడీపై పరికరాలు అందజేశాం. సబ్సిడీ వల్ల చాలా మంది రైతులు పండ్లతోటల సాగు వైపు మక్కువ చూపుతున్నారు.

ఆరుపదుల వయస్సులోనూ..

అలుపెరగని ఆటగాడు

క్రీడాకారులకు వయస్సుతో సంబంధం లేదనీ, కృషి, పట్టుదల ఉంటే చాలునని పల్లెం రాయలింగు నిరూపిస్తున్నాడు. ఈ బ్యాడ్మింటన్ ఆటగాడు ఆరుపదుల వయస్సులోనూ సత్తాచాటుతున్నాడు. ఉద్యోగవిరమణకు ముందు సింగరేణి తరుపున ఎన్నో పతకాలు సాధించిన రాయలింగు, ఈ నెల 11,12 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రథమ బహుమతి గెలుచుకున్నాడు. అక్కడి సెలక్టర్ల దృష్టిని ఆకర్షించి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడమేగాక, గెలుపే లక్ష్యంగా నిరంతర సాధన చేస్తున్నాడు. - మందమర్రి



జీఎం దంపతుల చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకుంటున్న రాయలింగు

● బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్న రాయలింగు ● సింగరేణి తరుపున ఎన్నో పతకాలు ● పలు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా ● తాజాగా జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

మందమర్రిలోని ఒకటో జోన్‌కు చెందిన పల్లెం రాయలింగు రిటైర్డ్ సింగరేణి కార్మికుడు. షటిల్ బ్యాడ్మింటన్‌లో తిరుగులేని ఆటగాడు. 1971లో సింగరేణి కార్మికుడిగా విధుల్లో చేరిన ఆయన, 2008లో ఉద్యోగ విరమణ పొందే వరకు సింగరేణి యాజమాన్యం ఏటా నిర్వహించే వార్షిక క్రీడలతో పాటు రీజియన్ కోల్ ఇండియాస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఈ క్రమంలో అనేక బహుమతులు సాధించి, సంస్థకు వన్నెతెచ్చారు. ఏరియాస్థాయిలో జరిగే పోటీల్లో సింగిల్స్, డబుల్స్ విభాగంలో ప్రథమ బహుమతులన్నీ రాయలింగునే వరించేవంటే అతిశయోక్తి కాదు. అత్యంత ప్రతిష్టాత్మకమైన కోల్ ఇండియా పోటీలకు 15సార్లు ఎంపికై అందులో ఆరుసార్లు సింగిల్స్, డబుల్స్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించిన ఘనత రాయలింగుది! రాయలింగు విద్యార్థి దశ నుంచే షటిల్ బ్యాడ్మింటన్‌పై ఆసక్తి పెంచుకున్నాడు. జిల్లా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులను సాధించాడు. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత కూడా ఆట మానలేదు. వివిధ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటూ సత్తా చాటుతున్నాడు. ఈ నెల 11, 12లో హైదరాబాద్‌లో జరిగిన 60, 65, 70 విభాగం రాష్ట్రస్థాయి సింగిల్స్, డబుల్స్‌లో ప్రథమ బహుమతి సాధించాడు. ఈయన ఆట తీంను వీక్షించిన బ్యాడ్మింటన్ అకాడమీ కోచ్ పుల్లెల గోపీచంద్ రాయలింగును ప్రత్యేకంగా అభినందించారు. ఆయన చూపిన ప్రతిభకు ముగ్ధులైన కోచ్‌లు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. దీంతో జాతీయస్థాయి పోటీల్లో ఎలాగైనా పతకం సాధించడమే లక్ష్యంగా ప్రతిరోజూ మందమర్రిలోని సీఈఆర్‌క్లబ్, ఇల్లందుక్లబ్‌లోని ఉడెన్ కోర్టులో సాధన చేస్తున్నాడు. గడిచిన 40 ఏళ్లుగా బ్యాడ్మింటన్‌లో రాణించడమంటే మాటలు కాదు. షటిల్ ఆడాలంటే శారీరక దారుఢ్యం అవసరం. ఈ క్రమంలో ఫిట్‌నెస్ కాపాడుకునేందుకు రాయలింగం పడుతున్న శ్రమ అంతా ఇంతా కాదు. ఆయనతో యువ క్రీడాకారులు సైతం పోటీ పడలేరంటే అతిశయోక్తి లేదు.



రాయలింగు ➤ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు

జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనాలని.. : పల్లెం రాయలింగు

విద్యార్థిగా ఉన్నప్పుడే షటిల్ బ్యాడ్మింటన్ నేర్చుకున్నాను. సింగరేణి ఉద్యోగంలో చేరిన తర్వాత ఎన్నో పతకాలు సాధించాను. పలువురు సింగరేణి డైరెక్టర్లు, జీఎంలు నన్ను అభినందించారు. సింగరేణి కీర్తి పతాకాన్ని కోల్ ఇండియాలో ఎగరవేశానంటూ కొనియాడారు. ఎలాగైనా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాలనేది నా జీవిత ఆశయం. ప్రభుత్వం సహకరిస్తే 60 ప్లస్ విభాగంలో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్రానికి పేరు తీసుకువస్తా.

వేంకటేశ్వరుని పూజిస్తే సకల సంతోషాలు

ఆధ్యాత్మికం

- శ్రీనివాసచార్యులు, పూజారి



మందమర్రి : అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామిని పూజిస్తే సుఖసంతోషాలతో పాటు సకల సంపదలు సమకూరుతాయి. వేంకటేశ్వరస్వామి మహిమ గల దేవుడు. ఆయనకు మొక్కులు చెల్లించుకుంటే కోర్కెలు తీరుతాయి. శుక్ర, శనివారాల్లో వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేయడంతోపాటు తులసి ఆకులను మాలగా చేసి వేయడం ద్వారా స్వామివారి అనుగ్రహం కలుగుతుంది. భక్తుల కొంగు బంగారం కావడం వల్లే నిత్యం లక్షలాదిగా తిరుమలకు తరలివెళ్తారు. ప్రతి రోజూ పూజలందుకునే దేవుడిగానూ వేంకటేశ్వరస్వామికి పేరుంది. ఉదయం 5 గంటలకు ప్రత్యేక పూజార్చన చేయడం ద్వారా సకల దోషాలు తొలిగి, శుభాలు చేకూరుతాయి. నిరుద్యోగులకు ఉద్యోగప్రాప్తితో పాటు యువతీ యువకులకు వివాహాలు జరుగుతాయి.



Employee Voice

పాఠశాలల్లో తాగునీటి వసతి కల్పించాలి

ఉద్యోగి వాయిస్

- మాకెనపల్లి శ్రీనివాస్, టీటీయూ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి



మందమర్రి : అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పించాలి. కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం నేపథ్యంలో మరుగుదొడ్లు లేక ఆరుబయటకు వెళ్తే పురుగూపుట్రా కరిసే ప్రమాదముంది. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినా నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. నీటి సౌకర్యం లేక పలుచోట్ల నిరుపయోగంగా దర్శనమి స్తున్నాయి. అధికారులు కాగితాలపై లెక్కలతో సరిపెట్టకుండా పాఠశాలల్లో రీ-సర్వే చేపట్టి, సమస్యలను గుర్తించాలి. తక్షణమే మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేయాలి. అదే విధంగా సురక్షిత తాగునీటి కోసం ప్రతి పాఠశాలలో నీటి శుద్ధి యంత్రం ఏర్పాటుచేయాలి. ఎలాంటి సమస్యలు లేనప్పుడే విద్యార్థులు చదువుపై దృష్టిపెట్టి, మంచి ఫలితాలు సాధించగలరు. ఆ దిశగా ఉన్నతాధికారులు కృషి చేయాలి.

రాగి కోసం ట్రాన్స్‌ఫార్మర్‌ల ధ్వంసం

● గుర్తు తెలియని దొంగల చేతి వాటం ● పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు ● ఆందోళనలో రైతులు

తాంసి: ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలో ట్రాన్స్‌ఫార్మర్‌ల దొంగతనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. నెల రోజుల వ్యవధిలోనే ఏడు ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీకి గురయ్యాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని వడ్డాడి, హస్నాపూర్, పొన్నారి గ్రా మాలల్లోని రైతు పంట పొలాల నుంచి ట్రాన్స్ ఫార్మర్‌లను దొంగలు ఎత్తుకెళుతున్నారు. రాత్రి సమయాలలో ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులకొట్టి రాగి తీగలను దొంగలిస్తున్నారు. కరెంటు సరఫరా ఉన్నప్పటికీ చాకచక్యంగా దొంగలిస్తున్నారు. తాంసి పోలీస్ స్టేషన్‌లో పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కూడా ప్రత్యేక నిఘా పెడుతున్నప్పటికీ దొంగలు మాత్రం పట్టుబడడం లేదు. తాజాగా మూడు రోజుల క్రితం పొన్నారి గ్రామానికి చెందిన మూడు ట్రాన్స్‌ఫార్మర్‌లలోని రాగి



చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్, ఇతర పరికరాలు

వైర్లను దొంగలించారు. ట్రాన్స్‌ఫార్మర్‌లన్నీ చిందర వందరగా పడి ఉన్నాయి. అందులోని రాగి తీగలను దోచుకుపోయారు. సోమవారం తాంసి గ్రామ రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో భీంపూర్ మండలంలో కూడా దొంగతనాలు జరిగిన సంఘటనలు చాలానే ఉన్నాయి. తలమడుగు, జైనథ్, బేల మండలాల తోపాటు జిల్లాలోని పలు ప్రాంతాలలో కూడా రైతుల ట్రాన్స్‌ఫార్మర్‌లు దొంగలించిన సంఘటనలు చాలానే ఉన్నాయి. ముఖ్యంగా రోడ్ల పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లనే ప్రధానంగా దొంగలు టార్గెట్ చేస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన వ్యక్తులు చేస్తున్నారా, లేక ఆదిలా బాద్ ప్రాంతానికి చెందిన వ్యక్తులు చేస్తున్నా రనే అనే విషయంపై పోలీసులు సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఇదిలా ఉంటే ట్రాన్స్‌పార్మర్‌ల విషయం పక్కా తెలిసిన వారే ఈ దొంగతనాలకు పాల్పడినట్లు ఉంటారని అనుమా నాలు వ్యక్తం అవుతున్నాయి. దొంగలను త్వరగ పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.



కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించాలంటే చాలా ఖర్చు అవుతుంది

- నవీన్ రెడ్డి, రైతు పొన్నారి గ్రామం

రెండు సంవత్సరాల క్రితం పంట పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తుకెళ్లారు. మళ్లీ అవే ఇప్పుడు పునరావృతం అవుతున్నాయి. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను భిగించాలంటే చాలా ఖర్చు అవుతుంది. వాటిన్నంటిని మేమే భరించాలి. దీంతో చాలా నష్టపోతున్నాము. విద్యుత్ అధికారులు, పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి



ట్రాన్స్‌ఫార్మర్ లేక వరి నార్లను వేయట్లేదు

- అరుణ్, రైతు పొన్నారి గ్రామం

వరుసగా ట్రాన్స్‌ఫార్మర్‌ల దొంగతనాలు జరుగుతున్నాయి. దొంగలను త్వరగా పోలీసులు పట్టుకోవాలి. ట్రాన్స్‌ఫార్మర్‌లు లేని కారణంగా వరి నార్లను వేయలేకపోతున్నాం. పంటకు సరైన సమయంలో నీటిని అందించకపోతే పంట దెబ్బతింటుంది. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించాలంటే విద్యుత్ అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

సమస్యాత్మక ప్రాంతాల్లో పకడ్బందీ చర్యలు చేపట్టాలి

● ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ ఎం.శ్రీనివాస్

ఆదిలాబాద్‌టౌన్: స్థానిక పోలీసు క్యాంపు కార్యాలయంలో నిర్మల్, ఆదిలాబాద్ జిల్లా పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ ఎం.శ్రీనివాస్ సమావేశాన్ని నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర డీజీపీ అనురాగ్‌శర్మ ఆదేశాల మేరకు ఇరు జిల్లా పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గణేష్ మండపాలు నిర్వహించే కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి అన్ని జాగ్రత్తలను చేపట్టాలన్నారు. పండుగ పూర్తయ్యే వరకూ ఎవ్వరూ సెలవులపై వెళ్లవద్దని ఎస్పీ సూచించారు. రెండు సార్లు శాంతి కమిటీ సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేశామని, అన్ని మతాల పెద్దలు, ప్రజలు, మండప నిర్వాహకులు, యువకులు పోలీసులకు అండగా ఉండి సహకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ఎ.లక్ష్మినారాయణ, వి.చంద్రప్రభు, నిర్మల్ డీఎస్పీ కె.మనోహర్‌రెడ్డి, భైంసా డీఎస్పీ అందే రాములు, నిర్మల్ గ్రామీణ సీఐ ఎల్.జీవన్‌రెడ్డి, నిర్మల్ స్పెషల్ బ్రాంచ్ ఎస్సై ఎంఎ కరీం, స్థానిక పట్టణ సీఐలు వి.సురేష్, టి.స్వామి, ఇచ్చోడ సీఐ ఎస్.సతీష్ కుమార్, ఉట్నూర్ సీఐ గణపతిజాదవ్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సైలు అన్వర్‌ఉల్ హక్, జి.రామన్న, సీసీ ఎం పోతరాజు, ఉట్నూర్ ఎస్సై మంగిలాల్, ట్రాఫిక్ ఎస్సై వెంకటేష్ పాల్గొన్నారు.

● ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని నిర్వహించారు. అర్జీదారుల సమస్యలను విని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.


మాట్లాడుతున్న ఎస్పీ ఎం.శ్రీనివాస్

అరచేతిలో ప్రాణాలు!

● రోడ్డు సౌకర్యం లేక అందని వైద్య సేవలు ● గర్భిణిని ఎడ్లబండిపై వాగు దాటించిన కుటుంబీకులు


సేవాదాస్‌నగర్‌లో ఎడ్లబండిపై ఆడే లతను వాగు దాటిస్తున్న కుటుంబీకులు

నేరడిగొండ : ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని బోరిగాం గ్రామ పంచాయతీ పరిధిలోని సేవదాస్‌నగర్‌కు చెందిన ఆడే లతకు సోమవారం పురిటి నొప్పులు రావడంతో గ్రామస్థులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ఎడ్లబండిపై వాగును దాటించి ఆసుపత్రికి తరలించారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగు ఉప్పొంగడంతో ఆ గ్రామానికి బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. దీంతో ఎడ్లబండిపై వాగు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్నేళ్లుగా అధికారులు, పాలకులకు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. గత నెలలో సేవదాస్‌నగర్‌కు చెందిన యువ రైతు రాథోడ్ మనోజ్‌కుమార్ పురుగుల మందు తాగగా ఎడ్ల బండిపై వాగుదాటించి ఆసుపత్రికి తరలించే క్రమంలో ఆలస్యం కావడంతో మృతి చెందాడు. ఇప్పటికైనా అధికారులు వంతెన నిర్మాణం చేపట్టి ఆదుకోవాలని సేవదాస్‌నగర్ వాసులు కోరుతున్నారు.

ముందస్తు ప్రణాళికతో బందోబస్తు నిర్వహించాలి

● రాష్ట్ర డీజీపీ అనురాగ్‌శర్మ


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర డీజీపీ అనురాగ్‌శర్మ

ఆదిలాబాద్‌టౌన్: గణేష్ ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు జరగకుండా ముందస్తు ప్రణాళికతో బందోబస్తును నిర్వహంచాలని రాష్ట్ర డీజీపీ అనురాగ్ శర్మ సూచించారు. జిల్లా ఎస్పీతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. నిర్మల్ జిల్లా ఎస్పీ విష్ణు ఎస్.వారియర్ సెలవులో ఉన్నందున నిర్మల్ జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ ఎం.శ్రీనివాస్ బాధ్యతలను నిర్వహించనున్నారు. నిర్మల్ జిల్లాలో 1900ల గణేష్ మండపాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. అందులో 524 గణేష్ మండపాలు సమస్యాత్మక ప్రాంతాల్లో, 1376 గణేష్ మండపాలు సాధారణ ప్రాంతాల్లో ప్రతిష్టిస్తున్నారని తెలిపారు. ఆదిలబాద్ జిల్లా ఈ సంవత్సరం 1787 గణేష్ మండపాల్లో 561 సమస్యాత్మకమైనవని, 1226 సాధారణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారని జిల్లా ఎస్పీ వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ మాట్లాడుతూ ఇరు జిల్లాలోని భైంసా, నిర్మల్, ఆదిలాబాద్, ఉట్నూర్ సమస్యాత్మకమైనవిగా ఉన్నాయని, స్వయంగా జిల్లా ఎస్పీలే పర్యవేక్షించాలన్నారు. చెక్‌పోస్టులు, మందిరం, మజీద్ ప్రాంగణంలో సాయుధ పోలీసులతో పికెట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. రాత్రి పగలు పెట్రోలింగ్, గస్తీ ముమ్మరంగా చేపట్టాలని, ప్రతీ గణేష్ మంపాల వద్ద పోలీసులు విధిని నిర్వహించాలన్నారు. విఘాత కలిగించే వారిని ముందస్తుగా గుర్తించి బైండ్ ఓవర్ చేయాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు ఉన్న చోట ముందుగానే సమన్వయ కమిటీలు నిర్వహించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని చోట్ల ఇరు మతాల శాంతి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. నిఘా వర్గ సభ్యులు విధుల్లో చురుకుగా వ్యవహరించాలన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పెంబి: నిర్మల్ జిల్లా పెంబి మండల కేంద్రంలో ఆదివారం బస్టాండ్ సమీపంలో వర్షంలో తడిసి వణుకుతు మాట్లాడని స్థితిలో ఉన్న వ్యక్తిని లయన్స్ యూత్ సభ్యులు పెంబి పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి, అనంతరం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోమవారం సదరు వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు ఎస్ఐ సంజీవ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాంపూర్‌లో మొక్కజొన్న పంట నష్టం

నర్సాపూర్ (జి): నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) మండలంలోని రాంపూర్ గ్రామంలో అటవీ శాఖ తవ్వించిన ట్రెంచ్‌లో భారీ వర్షం కారణంగా నీరు నిండింది. ట్రెంచ్ కట్ట తెగిపోవడంతో పక్కనే ఉన్ననే ఉన్న భూమారెడ్డి అనే రైతు పొలంలోకి నీరు చేరడంతో మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. అలాగే మామిడి తోటలో ఇసుక మేటలు వేయడంతో నష్టం వాటిల్లింది. సంబంధిత ఏఈవో అక్షయ్ కుమార్ నష్టపోయిన పంట పొలాన్ని పరిశీలించారు.

మట్టి వినాయక ప్రతిమలపై నేడు అవగాహన సదస్సు

నిర్మల్‌టౌన్: రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, నేషనల్ గ్రీన్ కోర్ డైరెక్టర్ సూచనల మేరకు జల వనరుల కాలుష్య నివారణలో భాగంగా విద్యార్థులకు మట్టి విగ్రహాలపై నేడు అవగాహన కల్పిస్తున్నట్లు డీఈవో ప్రణీత, జిల్లా నేషనల్ గ్రీన్ కో ఆర్డినేటర్ మోహన్‌రావులు ఒక ప్రకటనలో తెలిపారు. జుమ్మెరాత్‌పేట్ పాఠశాలలో మధ్యాహ్నం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రాజెక్టు అధికారి విద్యాసాగర్ వినాయక ప్రతిమల తయారీ, సహజ రంగుల వాడకం వలన కలిగే ప్రయోజనాలను వివరిస్తారని తెలిపారు.

గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలి

● గణేష్ మండపాల నిర్వహకులతో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించిన పోలీసులు



శాంతి సమావేశంలో మాట్లాడుతున్న సీఐ బాలరాజు

మామడ: ప్రతీ ఒక్కరు గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలని సోన్ సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ బాలరాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహిచారు. ఈ సందర్భంగా సీఐ బాలరాజు మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలలో అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. కరెంటు సరఫరాను సక్రమంగా అమర్చుకోవాలన్నారు. గణేష్ మండపాల వద్ద మండప నిర్వహకులు ప్రతీ రోజు ఇద్దరు నిద్రించాలన్నారు. రాత్రి సమయంలో పోలీసుల తనిఖీకి వచ్చినప్పుడు వారికి సహకరించాలన్నారు. నిమజ్జనాన్ని అర్ధరాత్రిలోపు పూర్తి చేయాలన్నారు. నిమజ్జనం సందర్భంగా డిజే సౌండ్‌లను ఉపయోగించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మల్లేష్, తహసీల్దార్ రామస్వామి, ఎంపీడీవో శేఖర్, ప్రజాప్రతినిధులు, గణేష్ మండపాల నిర్వహకులు తదితరులున్నారు.

నర్సాపూర్ (జి): నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం వినాయక మండపాల నిర్వహకులతో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాం నర్సింహారెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రతీ ఒక్కరు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. భారీ వినాయకులను ప్రతిష్ఠించి నిమజ్జన సమయంలో ఇబ్బందులు పడవద్దని, మట్టి నాయకులను ప్రతిష్ఠించాలన్నారు. నియజ్జనానికి సంబంధించిన గుర్తింపు కార్డులను అందిస్తే శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించేందుకు విగ్రహాలను త్వరగా తరలించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, నర్సాపూర్, డొంగుర్‌గాం, గొల్లమాడ, రాంపూర్, టెంబుర్నికి చెందిన మండప నిర్వహకులు పాల్గొన్నారు.

సారంగాపూర్: గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలని తహసీల్దార్ శ్యాం సుందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో గణేష్ విగ్రహ నిర్వహకులతో సమావేశం నిర్వహించారు. గణేష్‌ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యూత్ సభ్యులు జాగ్రత్తపడాలన్నారు. ఏదైనా సమస్యలు వస్తే నిర్వహకులు బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు. గణేష్ నిమజ్జనం సమయంలో డీజేలు పెట్టవద్దని, డీజేలు పెట్టిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతియుతంగా గణేష్ శోభాయాత్రను నిర్వహించాలన్నారు. అనంతరం ఉత్తమ అవార్డు తీసుకున్నందుకు ఎస్ఐ రవీందర్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్య క్రమంలో ఏఎంసీ చైర్మన్ రాజ్ మ హ్మద్, అడెల్లి పోచమ్మ దేవాలయం చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ డీవో గంగాధర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.


వినాయక మండపాల నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్ఐ

కదిలికి పోటెత్తిన భక్తజనం


నాగదేవతకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దిలావర్‌పూర్: మండలంలోని శ్రీ కదిలి పాపహరేశ్వస్వామి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం చివరి సోమవారం కావడం, అందులోనూ సోమవతి అమావాస్య కలిసి రావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. తెల్లవారు జామునుంచే భక్తుల రాక మొదలైన పవిత్ర గోముఖ గుండంలో స్నానమాచరించారు. మాతాన్నపూర్ణ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. 18 వృక్షాలతో కూడిన మహావటవృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఓం నమ: శివాయ మంత్రంతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. భక్తులకు ఆలయ ధర్మకర్తల కమిటీ ఆధ్వర్యంలో అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సంభాజీ పటేల్, ధర్మకర్తలు జడ్డ భూమేష్, నాకిడి భూషణ్, భుజంగ్ రావ్ పాటిల్, ఆలయ ఈవో నారాయణ భక్తులకు అసౌకర్యం కలుగకుండా పర్యవేక్షించారు. మాడెగాం, కుస్లి, కదిలి గ్రామాలకు చెందిన పలువురు యువతి, యువకులు భక్తులకు సేవలందించారు. దిలావర్‌పూర్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ముజ్గి గ్రామంలో పశువైద్య శిబిరం

నిర్మల్‌రూరల్: జాతీయ సేవా పథకంలో భాగంగా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం ముజ్గి గ్రామంలో పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ క్రిష్ణ ప్రసాద్ మాట్లాడుతూ పాడి పశువులతో రైతులు ఆర్థికంగా ఎదగొచ్చన్నారు. నిరుద్యోగ యువతకి జీవనోపాధి పెంపు కోసం పాడి పరిశ్రమ, గొర్రెలు, మేకలు, పేరటి కోళ్ల పెంపకం వంటి వాటిని చేపట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుమతి గోవర్ధన్‌రెడ్డి, చిట్యాల్ సర్పంచ్ మానస, ముజ్గి సర్పంచ్ ఎంబరి గంగవ్వ భూమన్న, ఎంపీటీసీ దౌలాన్‌బీ, నాయకులు బందెల భూమన్న, ఆలీ, గంగాధర్, గంగయ్య, నారాగౌడ్, లింగారెడ్డి తదితరులున్నారు.

కొనసాగుతున్న ఎంఆర్ వ్యాక్సినేషన్

దిలావర్‌పూర్: మండలంలోని పాఠశాలల్లో ఎంఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం సిర్గాపూర్‌లో ఫ్లేర్ హైస్కూల్, లోలంలోని లిటిల్ స్కాలర్ హైస్కూల్ విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సినేషన్‌ను వేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రాజేశ్వర్ పాండే, హెల్త్ సూపర్‌వైజర్ రత్నకుమారి, వేణురావు, హెల్త్ అసిస్టెంట్‌లు రమణా రెడ్డి, రాజశేఖర్, రంజిత్ కుమార్, ఏఎన్ఎంలు లక్ష్మి, పద్మ, సత్యవ్వ, సునంద, వరకుమారి, సునిత, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, బి. సురేష్ కుమార్‌లు పాల్గొన్నారు.


సిర్గాపూర్‌లో విద్యార్థులతో వైద్య సిబ్బంది

ఖైదీలకు ఈసీజీ వైద్య పరీక్షలు

నిర్మల్‌టౌన్: తెలంగాణ డయాగ్నోస్టిక్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కారాగారంలో ఉన్న ఖైదీలకు సోమవారం వైద్య పరీక్షలను నిర్వహించారు. సబ్ జైలర్ సీహెచ్ చిరంజీవి ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ నేత్ర వైద్య నిపుణుడు కృష్ణంరాజు మాట్లాడుతూ స్వీయ పరివర్తనతోనే ఖైదీలు సామాజికంగా పరివర్తన చెంది, బాధ్యతాయుతమైన పౌరులుగా మారాలన్నారు. నేరాలను మళ్లీ చేయవద్దన్నారు. అనంతరం ఖైదీల గుండెకు సంబంధించిన ఈసీజీ పరీక్షలను నిర్వహించారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఖైదీలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ నేరేళ్ళ హన్మంతు, టి. సంతోష్, జైలు పర్యవేక్షణాధికారి చిరంజీవి, జైలు సిబ్బంది తదితరులున్నారు.



ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అర్జీలపై నిర్లక్ష్యం చేయవద్దు: కలెక్టర్


ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ

నిర్మల్‌టౌన్: ప్రజా ఫిర్యాదుల విభాగంలో వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖలకు చెందిన అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలంబరిది అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను కలెక్టర్ స్వీకరించారు. భూ సంబంధిత కేసులు, సంక్షేమ పథకాలకు సంబంధించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారికి తప్పకుండా లబ్ధి చేకూరే విధంగా అధికారులు ఆదేశాలను జారీ చేయాలని అన్నారు. ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 25 వరకు ఎంఆర్ టీకా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి పిల్లలకు తప్పకుండా టీకాలు వేయించేలా తల్లిదండ్రులకు ప్రోత్సహించి టీకాలను వే యించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శివలింగయ్య, డీఆర్‌వో నగేష్, ఆర్డీవో ప్రశునాంభ, తహసీల్దా ర్ శంకర్, డీటీ కిరణ్మయి, పోలీసు శాఖ సిబ్బంది, ఇతర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆధార్‌ను అనుసంధానం చేయాలి: డీఈవో

నిర్మల్‌కల్చరల్: విద్యార్థుల ఆధార్ సంఖ్యను అనుసంధానం చేయాల్సిందిగా డీఈవో టి.ప్రణీత ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఈ నెల 26 లోగా చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేయాలన్నారు. విద్యార్థులకు లభించే అన్ని రకాల సదుపాయాలు ఆధార్‌తోనే ముడిపడి ఉన్నాయన్నారు. ధృవీకరణ పత్రాన్ని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు ఈ నెల 26లోగా అందించాలన్నారు. ఆయా మండలాల విద్యాధికారులు ఈ నెల 28లోగా ఎంఈఓలకు, 30లోగా జిల్లా విద్యాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు.

విలీనానికి వ్యతిరేకంగా నేడు బ్యాంకు ఉద్యోగుల సమ్మె

నిర్మల్ కల్చరల్: ప్రభుత్వ బ్యాంకులను పరిరక్షించుకోవడం, బ్యాంకుల విలీనాన్ని వ్యతిరేకిస్తూ నేడు ఒక రోజు సమ్మెకు బ్యాంకులు సిద్ధమైనట్లు తెలంగాణ కార్పోరేట్ బ్యాంకు నిర్మల్ జిల్లా అధ్యక్షుడు దెగావత్ శ్రీధర్‌రాథోడ్ తెలిపారు. యూనియన్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకింగ్ యూనియన్ పిలుపుమేరకు ఈ సమ్మె నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పద్దెనిమిది రకాల బ్యాంకులు నార్త్, సౌత్, వెస్ట్, ఈస్ట్ ఇండియన్ బ్యాంకుల్లో విలీన ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కోట్ల రూపాయలు బకాయిపడ్డ బడా వ్యాపార వేత్తల నుంచి అప్పును రాబట్టడానికి పార్లమెంట్‌లో చట్టం వేయాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఆర్‌డీఐ బిల్లును ఉపసంహరించుకోవడంతో పాటు బ్యాంకు బోర్డ్ ఆఫ్ బ్యూరోను రదు చేయాలన్నారు. క్యాడర్లలో ఉద్యోగనియామకాలు చేపట్టాలని కోరారు. సంబంధిత బ్యాంకు ఉద్యోగులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు.

'అర్హులైన బీసీలకు న్యాయం జరిగేలా చూడాలి'

నిర్మల్‌టౌన్: బీసీ సంక్షేమ అధికారిగా నూతన బాధ్యతలను స్వీకరించిన విజయ్ కుమార్‌ను బీసీ మహాసభ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. సాయన్న మాట్లాడుతూ బీసీలకు సంబంధించిన సంక్షేమ పథకాల విషయాల్లో అర్హులైన వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రెబల్ ఆఖిల్, విజయ్, నర్సయ్య, సాధం ఆనంద్, మోహన్, తదితరులున్నారు.

సినిమా గైడ్ నిర్మల్



తిరుమల: నేనే రాజు నేనే మంత్రి
వేంకటేశ్: జయ జానకి నాయకా
నారాయణ: ఫిదా

డాటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌టౌన్: నిర్మల్ పట్టణంలోని జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయం ప్రత్యేక గొర్రెల పథకానికి సంబంధించిన స్కీంలో కాంట్రాక్ట్ పద్ధతిన డాటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి జాఫర్ హమ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పాసై, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. అర్హులైన వారు ఈ నెల 28లోగా తమ దరఖాస్తులను జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

● మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి



సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్

నిర్మల్‌టౌన్: పట్టణంలో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి అన్నారు. సోమవారం పట్టణంలోని హరిజన వాడలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు చైర్మన్ భూమిపూజ చేశారు. 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి సీసీ రోడ్లకు నిధులను కేటాయించామన్నారు. పనుల్లో నాణ్యత పాటించి, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. అనంతరం కాలనీలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈ సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

'పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి'



వృద్ధులను సన్మానిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

నిర్మల్‌టౌన్: పెన్షనర్లు ఎదుర్కొనే సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేస్తామని నిర్మల్ జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్. జనార్ధన్, ఎంసి లింగన్న పేర్కొన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో సోమవారం నిర్వహించారు. పెన్షనర్లు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం వాటిపై సానుకూలంగా స్పందించాలన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రిన్సిపాల్ లింబగిరి స్వామి, ఎండి లతీపొద్దిన్, మహమూద్, గజ్జమ్మ, రాజమ్మ, చందులాల్, వీరమల్లు పోశెట్టిలను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎ. సుదర్శన్, కోశాధికారి ఎండి అన్వన్ హైమద్, బుచ్చన్న, భీంరావు, అబ్దుల్ సత్తార్, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా పొలాల అమావాస్య

నర్సాపూర్ (జి): రైతుల ప్రధాన పండుగ పొలాల అమావాస్యను మండలంలోని డొంగుర్గాం గ్రామంలోని రైతులు సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయాన్నే తమ కాడెద్దులను శుభ్రంగా కడిగి, వాటికి ఎడ్ల కొమ్ములకు రంగులు వేసి అలంకరించారు. భజా భజంత్రీలతో ఊరేగింపుగా వెళ్లి హనుమాన్ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. వాటికి ఇళ్ల వద్ద నైవేద్యం పెట్టి భక్తి శ్రద్ధలతో పూజించారు.



ముస్తాబైన కాడెద్దులు

సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిది

● ముస్లింలతో శాంతి సమావేశాన్ని నిర్వహించిన సీఐ జాన్‌దివాకర్

నిర్మల్‌టౌన్: బక్రీద్‌ను ముస్లీం సోదరులు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని నిర్మల్ పట్టణ సీఐ జాన్‌దివాకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ముస్లింలతో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ జాన్ దివాకర్ మాట్లాడుతూ మత సామరస్యంతో బక్రీద్‌ను నిర్వహించాలన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ చంద్రశేఖర్, ఎస్ఐ హరిపొద్దిన్, మున్సిపల్ వైస్‌చైర్మన్ అజీంబిన్ యాహియా, మాజీ వైస్ చైర్మన్ వాజిద్ హైమద్ ఖాన్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు అజార్, కౌన్సిలర్ రఫీ ఖురేషీ, నాయకులు నజీరొద్దిన్, ఆలీం, రావూఫ్ తదితరులున్నారు.

అంబేద్కర్ భవనం నిర్మించే వరకూ పోరాటం ఆగదు

● లక్ష్మణచాంద నుంచి నిర్మల్ జిల్లా కేంద్రం వరకూ దళిత సంఘాల పాదయాత్ర



జెండా ఊపి పాదయాత్రను ప్రారంభిస్తున్న రావుల రాంనాథ్

లక్ష్మణచాంద: జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవనాన్ని నిర్మించకుంటే తమ పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని జిల్లా దళిత, అంబేద్కర్ సంఘ నాయకుల బృందం హెచ్చరించారు. రూ.2 కోట్లతో జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ నివాస స్థలంలో అంబేద్కర్ సంఘ భవనాన్ని నిర్మించాలని కోరుతూ లక్ష్మణచాంద నుంచి జిల్లా కేంద్రం వరకూ సోమవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రను బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, సీపీఐ(ఎంఎల్) నేత సత్యనారాయణ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ భవన సాధన కమిటీ అధ్యక్షుడు పడిగెల రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి డి. రాములు, ఉపాధ్యక్షుడు న్యాతకాల ప్రసాద్, మెట్టు గంగాధర్ మాట్లాడారు. 20 సంవత్సరాలుగా భవన నిర్మాణ విషయంలో నిర్మల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, ఎంపీలు, మంత్రులు దళితులను మోసం చేస్తున్నారన్నారు. ప్రతీ జిల్లాలో రూ.2కోట్లతో అంబేద్కర్ స్మారక భవనం, స్టడీ సర్కిల్ నిర్మాణం కోసం సీఎం కేసీఆర్ నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చినప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధులు వివక్ష పూరిత వైఖరితో భవన నిర్మాణం చేపట్టకుండా జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పాదయాత్రతో వారి మోసాలను ప్రజలకు తెలియజేస్తామని, భవనం నిర్మించే వరకు దశల వారి ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సాధన కమిటీ అధ్యక్షుడు రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి డి.రాములు, ఉపాధ్యక్షుడు ఎన్. ప్రసాద్ కుమార్, మెట్టు గంగాధర్, గాజుల రవికుమార్, శంకర్, నాయకులు ఎన్‌టీ రాజేశ్వర్, సుంకరి సుదర్శన్, సిద్ధముత్యం, బండి శీల సాగర్, వెంకటస్వామి, జగన్ మోహన్ లతో పాటు 300 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.



లక్ష్మణచాందలో మాట్లాడుతున్న ప్రసాద్ కుమార్

చెత్తకుప్పలను తొలగించాలని ముదిరాజ్‌ల ఆందోళన



రోడ్డు పక్కన పోసిన చెత్తకుప్పలు

ఖానాపూర్: ఖానాపూర్ శివారు ప్రాంతంలో చిన్నయ్య, పెద్దయ్య గుట్ట వద్ద ఖానాపూర్- దిలావర్‌పూర్ రోడ్డు పక్కన గ్రామపంచాయతీ సిబ్బంది వేస్తున్న చెత్తకుప్పలను తొలగించాలని సోమవారం ఖానాపూర్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. చిన్నయ్య, పెద్దయ్య గుట్ట వద్దకు ముదిరాజులమంతా వనభోజనాలు చేసేందుకు వస్తామన్నారు. తమ కులదైవమైన భీమన్న స్వామి గుట్టపై కొలువై ఉన్నందున తామంతా ప్రతీ వారం పూజలు నిర్వహించేందుకు ఇక్కడి వస్తామని, ఈ ప్రాంతంలో ఖానాపూర్ గ్రామపంచాయతీ సిబ్బంది చెత్త వేయడంతో ఈ ప్రాంతమంతా దుర్గంధం అవుతోందన్నారు. గ్రామపంచాయతీ అధికారులు వచ్చి చెత్తకుప్పలను ఇక్కడి నుంచి తొలగించే వరకు తాము ఇక్కడి నుంచి కదిలేది లేదని ఖానాపూర్- దిలావర్‌పూర్ రహదారిపై బైఠాయించారు. గ్రామపంచాయతీ కార్యాదర్శి శ్రీధర్ వచ్చి చెత్తను తొలగిస్తామని గుట్ట ప్రాంతంలో మట్టిపోయించి పరిసరాలను శుభ్రం చేయిస్తానని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జక్కుల నాగరాజు, పంబాల భీమన్న, పూదరి బీమన్న తదితరులున్నారు.

'వైద్యరంగంలో వేణుగోపాలకృష్ణ సేవలు మరువలేనివి'

ఖానాపూర్: వైద్య విద్యను పూర్తి చేసుకున్న నాటి నుంచి నేటి వరకూ ప్రైవేటు ఆసుపత్రులల్లో వైద్యవృత్తిని చేపట్టకుండా ప్రభుత్వ వైద్యునిగానే విధులు నిర్వహిస్తోన్న డాక్టర్ వేణుగోపాలకృష్ణ నేటి సమాజంలో ఎందరికో ఆదర్శంగా నిలుస్తారని ఖానాపూర్ ఎస్ఐ వినయ్‌కుమార్, కడెం ఎస్ఐ బాలకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో సోమవారం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వేణుగోపాలకృష్ణను ఇరు ఎస్సైలు సన్మానించారు. వైద్యరంగంలో వేణుగోపాలకృష్ణ చేస్తున్న సేవలు మరువలేనివని, ఆ సేవలకు నిదర్శనమే ఇప్పటికీ పదహారుసార్లు ఉత్తమ వైద్యునిగా అవార్డు పొందడమన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ బోజాగౌడ్, కానిస్టేబుల్ నవీన్‌రెడ్డి, రైటర్ సురేష్, తదితరులున్నారు.



ఖానాపూర్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌ను సన్మానిస్తున్న ఎస్సైలు

రైతు సమస్యలపై ఏఐకేఎంఎస్ నిరంతర పోరాటం

● ఏఐకేఎంఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నందిరామయ్య

ఖానాపూర్: దేశంలోని రైతులు, రైతు కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐకేఎంఎస్ నిరంతరం పోరాటం చేస్తోందని ఏఐఎంఎస్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నందిరామయ్య అన్నారు. రైతాంగం పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో క్రేంద, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయన్నారు. 2002 సంవత్సరంలో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో చేసిన భూపోరాటం ద్వారా దాదాపు 15 వేల ఎకరాలను పేదలు పోరాడి సాధించుకున్నారన్నారు. ఖానాపూర్‌లోని ప్రభుత్వ భూమి 110 ఎకరాలను పేదలకు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలో రైతులు, రైతు కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై కూలంకశంగా చర్చించేందుకే రేపు భైంసాలో ఎన్‌ఆర్‌గార్డెన్‌లో ఉమ్మడి జిల్లా జనరల్ కౌన్సిల్ సభ నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎందరో రైతులు ఆత్మహత్య చేసుకుంటే ప్రభుత్వం వాటిపై కనీసం స్పందిచడం లేదన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ఈ సభకు ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వేముల పల్లి వెంకట్రామయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వి. కోటేశ్వర్ రావులతో పాటు పలువురు జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు హాజరవుతున్నారన్నారు. ఈ సమావేశానికి నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో వచ్చి విజయ వంతం చేయాలని ఆయన కోరారు.

'పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి'

ఖానాపూర్: మండలంలో పాత్రికేయులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరుతూ ఖానాపూర్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నరేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ ఖానాపూర్‌లో ఇరవై ఎళ్లుగా తామంతా పాత్రికేయ వృత్తిలో ఉన్నామని ఇప్పటి వరకు గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ ఇళ్ల స్థలాలను కేటాయించలేదన్నారు. ప్రభుత్వం నిర్మించబోయే డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో తమకు ప్రాధాన్యం కల్పించాలన్నారు.

కలమడుగు చెక్ పోస్ట్ గేట్ తగిలి యువకుడి మృతి

దస్తూరాబాద్: మండలంలోని గొడీసిర్యాల్ గ్రామానికి చెందిన యువకుడు ద్యాగేటి వినోద్ (24) ఆదివారం అర్ధరాత్రి సమయంలో చెక్‌పోస్టు గేట్ తగిలి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గొడీసిర్యాల్ గ్రామానికి చెందిన వినోద్ తోటి మిత్రులతో కలిసి ఆదివారం ఉదయం వినాయక విగ్రహ కొనుగోలుకు ట్రాలీలో జగిత్యాలకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ట్రాలీలోని విగ్రహం వెనుక భాగంలో నిల్చున్నాడు. కలమడుగు ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద స్టాప్ గేట్ కిందకు ఉంది. ప్రమోద్ తలకు గేట్ బలంగా తగలడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం కోసం లక్షేటిపేట్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యువకుడి మరణంతో గొడీసి ర్యాల్ లో విషదచాయలు అలుముకున్నాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



ప్రమోద్ (ఫైల్)

తోతర్య తండాలో నీటమునిగిన పత్తి పంట

పెంబి: ఆదివారం కురిసిన భారీ వర్షానికి కడెం వాగుపక్కన లోతర్య తండాకు చెందిన భుక్యరెడ్డి ఆయన 5 ఎక రాల పత్తి పంట నీట మునిగింది. అధికారులు నష్టపరిహారాన్ని ఇవ్వాలని కోరుతున్నాడు.

ఫిర్యాదుల విభాగాన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీడీవో

కుభీర్: మండల పరిషత్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ఫిర్యాదుల విభాగాన్ని మండల వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో దేవేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఫిర్యాదుల విభాగానికి కుభీర్ మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి, మండల ప్రజలను ఆదుకోవా లని మాదిగ జేఏసీ నాయకులు దరఖాస్తును అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఏపీవో నవీన్ కుమార్, ఏపీఎం సృజన్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి వేడుకలకు ఏర్పాట్లు

❖ మున్సిపల్ అధికారుల బిజీబిజీ ❖ అదనపు సౌకర్యాల కల్పన ❖ నిమజ్జనోత్సవ వాహనాల రాకపోకలకు వేర్వేరుగా మార్గాలు

భైంసా: మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కానున్న వినాయక చవితి వేడుకలకు సంబంధించిన ఏర్పాట్ల చర్యలను మున్సిపల్ అధికార యంత్రాంగం వేగవంతం చేసింది. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లను చేపట్టేందుకు గాను అధికారులు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించే ఆయా కాలనీల్లోని అంతర్గత రోడ్లకు అవసరమైన మరమ్మతు చర్యలను ప్రారంభించారు. నిమజ్జనోత్సవ ప్రక్రియ నిర్వహించే గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద పకడ్బందీ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే మున్సిపల్ వైస్ చైర్మన్ జాబీర్ అహ్మద్, ఆర్డీవో రాజు, డీఎస్పీ అందె రాములు, అర్‌అండ్‌బీ, ఇరిగేషన్, మున్సిపల్, ట్రాన్స్‌కో అధికార యంత్రాంగం సమీక్ష సమావేశం నిర్వహించారు. అందుకు అనుగుణంగానే ఏర్పాట్ల చర్యలను వేగిరవంతం చేశారు.


గడ్డెన్న వాగు ప్రాజెక్టు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

● అదనపు వసతులు

ఈ పర్యాయం వినాయక చవితి వేడుకలకు సంబంధించి మున్సిపల్ అధికార, పాలక వర్గాలు అదనంగా ఏర్పాట్లు చేపడుతున్నారు. క్రేన్లు, గజ ఈతగాళ్లు, జనరేటర్లను అదనంగా ఏర్పాటు చేశారు.

● రాకపోకలకు వేర్వేరు మార్గాలు

నిమజ్జనోత్సవానికి సంబంధించి ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా మున్సిపల్ అధికార, పాలక వర్గాలు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాయి. ప్రాజెక్టు వద్ద విగ్రహాలను తీసుకవచ్చే వాహనాలకు రాకపోకలకు వేర్వేరుగా మార్గాలను ఏర్పాటు చేశారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

భైంసా రూరల్: మండలంలోని సిరాల మహాదేవ్ ఆలయంలో, చుచుంద్‌లోని సిద్ధేశ్వర ఆలయం, సుంక్లీలోని నాగదేవత ఆలయం, వానల్‌పాడ్‌లోని దత్తాత్రి ఆలయం, చింతల్‌బోరిలోని శ్రీ రాజరాజేశ్వర ఆలయం, దేగాంలోని సాయిబాబా ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడాయి శ్రావణ మాసపు చివరి సోమవారం సందర్భంగా భక్తులు దైవ దర్శనం కోసం ఆలయాల్లో బారులుతీరి కనిపించారు. భక్తులు ఆయా దేవతామూర్తులకు భక్తి శ్రద్ధలతో పూజలు చేసి ధూప, దీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణమాసపు చివరి రోజును పురస్కరించుని అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

నేడు భైంసాలో ప్రత్యేక పశువైద్య శిబిరం

భైంసా: పట్టణంలోని పశువైద్యశాలలో మంగళవారం పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, కోరుట్ల పశువైద్య కళాశాల, జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పశువైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసినట్లుగా భైంసా పశు వైద్యాధికారి డా.విట్టల్ తెలిపారు. జాతీయ సేవా పథకంలో భాగంగా నిపుణులైన అధ్యాపక బృందం పశువైద్య శిబిరంలో పాల్గొని సేవలందిస్తారని పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ప్రత్యేక పశువైద్య శిబిరంలో జబ్బు పడిన పశువులకు, పశువులలో గర్భకోశ వ్యాధుల నిర్ధారణ, చూలు నిర్ధారణ, మొదలగు చికిత్సలు నిర్వహిస్తారన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

లోకేశ్వరం: మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సాయిరాం తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర కార్యదర్శిగా గిరి సాయిబాబు

కుభీర్: మండల కేంద్రానికి చెందిన గిరి సాయిబాబు వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైనట్లు సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన ఈ ఎన్నికలు రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, రాజేశ్వర్ పాండే ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శిగా తనపై నమ్మకం ఉంచి ఎన్నుకున్నందుకు వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఆరో రోజుకు చేరిన తపాలా ఉద్యోగుల సమ్మె

భైంసా: గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె ఆరవ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా సోమవారం స్థానిక పోస్టాఫీస్ కార్యాలయం ముందు గ్రామీణ తపాల ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని, డిమాండ్లు నెరవేర్చాలంటూ నినాదాలు చేస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐజీఎస్‌యూ ప్రతినిధులు మాట్లాడారు. సమ్మెలో భైంసా, బాసర,ముథోల్ సబ్ డివిజన్ పరిధిలోని ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'గో సంతతి వధ జరగకుండా చర్యలు తీసుకోవాలి'

భైంసా: వచ్చే నెలలో బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని డివిజన్ పరిధిలో గోసంతతి వధ, అక్రమ రవాణా జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని భైంసా డివిజన్ గోసేవా-గోసంరక్షణ విభాగము డిమాండ్ చేసింది. ఈ మేరకు సంబంధిత విషయమై సోమవారం ఆర్డీవో కార్యాలయంలో, పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో గోసేవా-గోసంరక్షణ జిల్లా ప్రతినిధి నూకల సురేష్, హిందూవాహిని జిల్లా అధ్యక్షులు సంతోష్, బీజేపీ ప్రతినిధులు బాలాజీ సుత్రావే, నిజాం వేణుగోపాల్, విశ్వ హిందూపరిషత్ ప్రతినిధి గుండొల్ల రాజు, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి బాలకృష్ణదాస్‌లు మాట్లాడారు.

'ఫిర్యాదుల విభాగాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

లోకేశ్వరం: ప్రతీ సోమవారం నిర్వహించే ఫిర్యాదుల విభాగాన్ని మండలంలోని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని లోకేశ్వరం తహసీల్దార్ లోకేశ్వరరావు అన్నారు. సోమవారం నిర్వహించిన ఫిర్యాదుల విభాగానికి నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారిణి జెస్సి, మండల సూపరెండెంట్ సాయన్న, ఏఈవోలు, కె.మౌనిక, ఎస్.మౌనిక, ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ సాయికిరణ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు

భైంసా: పట్టణంలో ఉర్సు ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంతం నుంచి బడా పాహడ్ వరకు శోభయాత్ర కొనసాగింది. ఉదయం ఉత్సవ ప్రతినిధులు మహ్మద్ ఇక్రమొద్దీన్, మహ్మద్ మజరోద్దీన్, మహ్మద్ అరిఫొద్దీన్ సారథ్యంలో శోభయాత్ర కొనసాగింది. అనసూయవవార్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాంరావు పటేల్ తన అనుచరగణంతో శోభయాత్రగా తరలివెళ్లి చాదర్ సమర్పించారు. టీఆర్ఎస్ ప్రతినిధులు మురళీగౌడ్, శ్రీనివాస్, కష్ట లు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తరపున చాదర్‌ను సమర్పించారు. అశ్వంపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి చాదర్‌లను బడాపాహడ్ దర్గా వరకు తీసుకెళ్లి సమర్పించారు. ఈ సందర్భంగా శోభయాత్రలో యువకులు నృత్యాలు చేశారు.


చాదర్ తీసుకవెళుతున్న ట్రస్టు చైర్మన్ రాంరావు పటేల్

గ్రామాల్లో ఘనంగా పొలాల అమావాస్య

కుంటాల, భైంసారూరల్, కుభీర్, ముథోల్, లోకేశ్వరం, బాసర: ఆయా మండలాల్లోని గ్రామాల్లో సోమవారం పొలాల అమావాస్య పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పండుగలో భాగంగా రైతులు ఉదయం పూట నిద్ర లేచి వారి బసవన్నలను స్థానిక చెరువులో శుద్ధిచేసి, వాటిని అలంకరించి ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హనుమాన్ ఆలయం చుట్టు ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ పండుగ వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. కాడెడ్లు, ఆవులకు ప్రత్యేక పూజలు చేసి ధూప, దీపా నైవేద్యాలు సమర్పించుకున్నారు. కాగా, బాసరలో రైతులు ట్రాక్టర్లతో వ్యవసాయం చేయడంతో వాటితోనే పొలాల అమావాస్య పండుగను నిర్వహించుకున్నారు. ఎద్దులతో పాటు రైతులు ట్రాక్టర్లను హనుమాన్ ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించడం విశేషం.


ఇలేగాంలో బసవన్నలతో శోభయాత్ర


బిద్రెల్లి గ్రామ శివారులో వరద నీటికి దెబ్బతిన్న కూరగాయల పంటలు


వరద నీటి ఉధృతికి బాసర- కిర్గుల్(బి) రహదారికి ఏర్పడ్డ గండ్లు

జలాశయాలుగా పంట పొలాలు

● వందల ఎకరాల్లో పంటల నష్టం
● దెబ్బతిన్న రహదారులు

బాసర: ఇటీవల కురిసిన వర్షాలు రైతులకు కొంత మోదం, మరికొంత ఖేదాన్ని మిగిల్చాయి. బాసర మండల పరిధిలో మూడు రోజుల పాటు కురిసిన వర్షాలతో మొన్నటి వరకు నీరులేక కళ తప్పిన పంటలు, చెరువులు, ఒర్రెలన్నీ నీటిలో నిండు కుండలా మారాయి. వరి వంటి పంటలు వేసుకునే రైతులు మొఖంలో ఆనందం కనిపిస్తుంది. వాగు తీరం, చెరువుల, ఎగువ భాగంలో గల పంటల భూముల్లో వరద నీరు ముంచెత్తింది. ముఖ్యంగా బిద్రెల్లి వాగు పొంగడంతో పంటపొలాల్లో భారీగా వరద నీరు వచ్చి చేరింది. లోతట్టు ప్రాంతాల్లో జలాశయాలుగా దర్శనమిచ్చాయి. వందల ఎకరాల్లో పత్తి, మినుము, సోయా, పెసర, కూరగాయల పంటలు నష్టపోయాయి. రైతుల నష్టనివారణ చర్యలు చేపట్టడానికి వీలు లేకుండా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో రూ.వేల పెట్టుబడి పెట్టిన రైతులు లబోదిబోమంటున్నారు. కాగా, వివిధ గ్రామాల రోడ్లు దెబ్బతిన్నాయి. బాసర, కిర్గుల్(బి) గ్రామాల వద్ద గల బీటీ రహదారి మూడు చోట్ల గండి పండింది. వాగు సమీపాన వరద నీటి ఉధృతికి రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో సోమవారం బాసర కిర్గుల్(బి) మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

పంటలను పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారులు

ముథోల్: గత రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురియడంతో పంటలు నీటమునిగాయి. అయితే సోమవారం ముథోల్‌తో పాటు ఆయా గ్రామ శివార్లలో నీట మునిగిన సోయా, పత్తి పంటలను వ్యవసాయ శాఖ ఏఈఓ భాస్కర్, ఏఈవో విలాస్, శివరాజ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు పత్తి పంటలో నిలిచిన నీరుకు ఎండుతెగుళ్ళ ఆశించే అవకాశం ఎక్కువ ఉంటుంది. వాటి నివారణకు పంటచేలలో ఉన్న మురుగునీటిని కాలువల ద్వారా తీసివేయాలని సూచించారు. రైతులకు సందేహాలు, సలహాలు, సూచనలకు శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.


పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఇంటర్వ్యూ

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


డా.వంశీమోహన్, పీహెచ్‌సీ వైద్యుడు

ఆంధ్రజ్యోతి: ప్రస్తుతం సీజన్‌లో వచ్చే వ్యాధులు ఏవి?

డాక్టర్: ఇది వర్షాకాలం. సీజన్ వ్యాధులు సులభంగా ప్రబలే అవకాశం ఉంటుంది. విష్యజ్వరాలతో పాటు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉంది.

ఆంధ్రజ్యోతి: మరి ఈ వ్యాధులకు అవసరమైన చికిత్స అందించేందుకు మందులు దవాఖానాలో ఉన్నాయా?

డాక్టర్: మందులు అన్ని అందుబాటులో ఉన్నాయి. జ్వరం, ఇతర అనారోగ్య లక్షణాలు తెలియగానే ఆసుపత్రికి రావాలి. ప్రారంభంలో వస్తే వ్యాధులు తొందరగా నయమయ్యేలా చూడవచ్చు.

ఆంధ్రజ్యోతి: చిన్న పిల్లలకు వ్యాక్సిన్లు ఎప్పుడు అందిస్తున్నారు?

డాక్టర్: బుధ, శనివారాల్లో అందిస్తున్నాం. 9నెలల నుంచి 15ఏళ్ల వరకు వయస్సున్న పిల్లలకు తట్టు, ఎలర్జీ, దద్దుర్లు, తదితర వ్యాధులు రాకుండా మీజిల్స్ రుబెల్లా టీకాలను వేస్తున్నాం. - బాసర

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 4, 9




మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): వృత్తి, వ్యాపారాల్లో సృజనాత్మంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. సహోద్యోగులతో విందు వినోదాల్లో పాల్గొంటారు. ప్రియతముల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తారు. సంకల్పం నెరవేరుతుంది.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): చిన్నారులు, ప్రియతముల కలయిక ఆనందం కలిగిస్తుంది. సంతానం విషయంలో శుభపరిణామాలు సంభవం. పొదుపు పథకాలు, చిట్‌ఫండ్‌లకు అనుకూలం. ఇంటి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు.



మిథునరాశి: (మే21-జూన్21): రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారు కీలక సమాచారం అందుకుంటారు. బదిలీలు, మార్పులకు అనుకూలం. ఇంటికి అవసరమైన వస్తువులు రవాణా అవుతాయి. విద్యా సంస్థల్లో ప్రవేశం లభిస్తుంది.



కర్కాటకరాశి: (జూన్22-జూలై23): సోదరీ సోదరుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. బోధన, రవాణా, స్టేషనరీ, కమ్యూనికేషన్ల రంగా వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. విలువైన పత్రాలు చేతికి అందుతాయి.



సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): పెట్టుబడులపై దృష్టి సారిస్తారు. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంటారు.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సినీ, రాజకీయ రంగాల వారు కొత్త ప్రాజెక్టులు ప్రారంభిస్తారు. కొంతకాలంగా వెంటాడుతున్న స్తబ్ధత తొలగిపోయి మనసు ప్రశాంతంగా ఉంటుంది. విరామ కాలక్షేపాలు ఉల్లాసం కలిగిస్తాయి.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): దీర్ఘకాలికి పెట్టుబడులకు అనుకూలం. సినీ రాజకీయ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకంగా ఉంటుంది. ఆడిటింగ్, బ్యాంకింగ్ రంగాల వారికి ప్రోత్సాహకరం. విరాళాలు, చందాలకు వెచ్చిస్తారు.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): బృందకార్యక్రమాల్లో ప్రముఖులను కలుసుకుంటారు. ఆర్థిక విషయాల్లో లక్ష్య సాధనకు పెద్దల సహకారం లభిస్తుంది. సమావేశాల్లో గౌరవ, మన్ననలు అందుకుంటారు. సంకల్పం నెరవేరుతుంది.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): వృత్తి, వ్యాపారాల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. రక్షణ, న్యాయ, బోధన రంగాల వారికి వృత్తిపరంగా ప్రోత్సాహకరం. గౌరవ పదవులు అందుకుంటారు.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఆర్థికపరమైన వ్యూహాలు ఫలిస్తాయి. రక్షణ, న్యాయ, బోధన రంగాల వారికి నిధులు సర్దుబాటవుతాయి. ప్రయాణాలకు ఏర్పాట్లు చేసుకుంటారు. పెట్టుబడులకు సంబంధించిన పత్రాలు అందుకుంటారు.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): క్రయవిక్రయాలకు అనుకూలం. బీమా, గ్రాట్యుటీ, పన్నుల వ్యవహారాలు పూర్తి చేస్తారు. భాగస్వామి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. శ్రీవారు, శ్రీమతి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి.



మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): భాగస్వామి సహకారంతో వృత్తిపరమైన లక్ష్యాలు సాధిస్తారు. విందులు, వేడుకల్లో పాల్గొంటారు. జనసంబంధాలు విస్తరిస్తాయి. స్నేహానుబంధాలు బలపడతాయి. సంకల్పం నెరవేరుతుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

కలెక్టరేట్‌లో వినతుల వెల్లువ

మంచిర్యాల క్రైం: కలెక్టర్ కార్యాలయంలో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఆయా మండలాలకు చెందిన ప్రజలు సమస్యలను ప్రజావాణిలో విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఇన్‌చార్జి కలెక్టర్ ప్రియాంక సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.





వినతులు స్వీకరిస్తున్న డిప్యూటీ కలెక్టర్, వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన సింగరేణి ఓసీపీ భూ నిర్వాసితులు

● చెక్కులు అందజేయాలని..

సింగాపురం ఓసీపీ నిర్వాసితులు 18 మంది చెక్కులను అంద జేయాలని కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండ్లకు సంబంధించిన చెక్కులు వచ్చాయని తమకు నోటీసులు అందినప్పటికీ చెక్కులను అందజేయడం లేదని వారు వాపోయారు.

ఆర్డీవోకు కలువకుండా కింద స్థాయి అధి కారులు కావాలనే చెక్కులను తమకు అందించడం లే దన్నారు. వినతి పత్రం అందించిన వారిలో నడిపెల్లి సత్యనారాయణ, పద్మ, సత్తయ్య, రాయలింగు, కిష్టయ్య, శంకరమ్మ, తదితరులు ఉన్నారు.

● గ్రామ సమస్యలను పరిష్కరించాలని..

భీమిని మండలంలోని చిన్న గుడిపేట నుంచి వడాల్ వరకు 4 కిలో మీటర్ల రోడ్డును నిర్మించాలని, వ్యవసాయ బోర్‌లకు విద్యుత్ లైన్ పొడగించి రైతులను ఆదుకోవాలని భీమిని సర్పంచ్‌భువనగిరి రజిత వినతి పత్రం అందజేశారు.

●ప్రజావాణి నిర్వహించాలని..

మంచిర్యాల జిల్లాకు బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట, నెన్నెల, మండలాలు దూరంగా ఉన్నాయని, కలెక్టర్ ఫిర్యాదులను బెల్లంపల్లిలోనే ప్రజావాణి నిర్వహించాలని మర్చెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొలిపాక శ్రీవాస్ వినతి పత్రం అందజేశారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఆమరణదీక్ష

● టీయూడబ్ల్యూజే (ఐజేయూ)జిల్లా అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి



మంచిర్యాలలో మాట్లాడుతున్న ప్రకాష్‌రెడ్డి

మంచిర్యాల రూరల్ : జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మంగళవారం నుంచి మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆమరణ దీక్ష చేయనున్నట్లు టీయూడబ్ల్యూజే (ఐజేయూ)జిల్లా అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు గడిచినప్పటికీ జర్నలిస్టులకు జిల్లాలో నేటి వరకు అక్రిడేషన్, హెల్త్ కార్డులు అందలేదని పేర్కొన్నారు. పలు మార్లు అక్రిడేషన్ కార్డుల విషయమై అధికారులకు తెలియజేసినప్పటికీ స్పందన కరువైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదిగో ఇస్తాం....ఇదిగో ఇస్తాం అంటూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి కేసీఆర్ జర్నలిస్టులందరికీ డబుల్ బెడ్‌రూం ఇండ్లను అందించాలని, అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసమే ఆమరణ నిరాహార దీక్ష చేయనునట్లు వివరించారు. జిల్లాలోని జర్నలిస్టులు దీక్షకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ సభ్యులు మంగపతి చంద్రశేఖర్, సతీష్, లక్కాకుల శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు సంపత్, సీనియర్ జర్నలిస్టులు శ్రీనివాస్, వంశికృష్ణ, దెబ్బటి తిరుపతి, గడ్డం సతీష్ యాదవ్, పూరేళ్ల లక్ష్మణ్, ముద్దం రవి, బిరుదుల దేవరాజు, సంతోష్, వినోద్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

మంచిర్యాల టౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సబ్‌జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ జట్టును సోమవారం మంచిర్యాలలో ఎంపిక చేశారు. స్థానిక సెవెన్‌హిల్స్ హైస్కూల్‌లో జరిగిన పోటీలను పాఠశాల కరస్పాండెంట్ భాగ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ పోటీలలో ఉమ్మడి ఆదిలాబాద్‌లోని 24 మండలాల నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. నైపుణ్యాన్ని ప్రదర్శించిన 16 మంది క్రీడాకారులతో పాటు ఐదుగురిని స్టాండ్‌బైలుగా ఎంపిక చేసినట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కనపర్తి రమేష్ తెలిపారు. కాగా ఎంపికైన జిల్లా జట్టు సెప్టెంబర్ 10 నుంచి 12 వరకు కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలో జరుగన్ను రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలలో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. పోటీల ప్రారంభోత్సవంలో జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రా జయ్య, పీఈటీ సంఘం అధ్యక్షుడు గో పాల్, కార్యదర్శులు బెల్లం శ్రీనివాస్, గాజు శ్రీనివాస్, నిర్మల్ జిల్లా హ్యాండ్‌బాల్ కన్వీనర్ పెంటన్న, కుమరంభీం జిల్లా కన్వీనర్ విష్ణు, పాల్గొన్నారు.

గోదావరి నిమజ్జన స్థలాన్ని పరిశీలించిన డీసీపీ

మంచిర్యాల క్రైం : పట్టణంలో గోదావరిలో గణేష్ నిమజ్జనం కోసం సోమవారం డీసీపీ జాన్‌వెస్లీ గోదావరి రోడ్డు, నదీ తీర ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో సుమారు 250కి పైగా గణేష్ మండపాల ఏర్పాటు, సుమారు వందకు పైగా భారీ గణేష్‌లను రాయపట్నం, గోదావరిఖని బ్రిడ్జి వద్ద నిమజ్జనం చేస్తారని అంచనా. చిన్న చిన్న విగ్రహాలను మంచిర్యాల నుంచే కాకుండా మందమర్రి, బెల్లంపల్లి నుంచి వచ్చే విగ్రహాలను కూడా నిమజ్జనం చేసేందుకు అనువుగా గోదావరిలో తాత్కాలికంగా రోడ్డు, దీపాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు డీసీపీ సూచించారు. అనంతరం దండేపల్లి మండలం గూడెం రాయపట్నం బ్రిడ్జి వద్ద నిమజ్జన స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం గోదావరిలో నీటి మట్టం తక్కువగా ఉందన్నారు. ఆయనతో పాటు ఎస్సై ఆకుల అశోక్, సిబ్బంది ఉన్నారు.

మీజిల్స్, రుబెల్లా టీకాలో మంచిర్యాల జిల్లాకు రెండో స్థానం

● కలెక్టర్ ఆర్వీ కర్ణన్

మంచిర్యాల క్రైం : మీజిల్స్, రుబెల్లా టీకాలు వేయుటలో రాష్ట్రంలోనే మంచిర్యాల జిల్లా రెండో స్థానంలో ఉందని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 40 శాతం వాక్సినేషన్ పూర్తి చేశామన్నారు. మూడో విడత హరితహారం కార్యక్రమంలో జిల్లాలో 95 లక్షల మొక్కలు నాటడం లక్ష్యం కాగా ఇప్పటి వరకు 70 లక్షల 23 వేల మొక్కలు నాటామని తెలిపారు. 73.94 శాతం లక్ష్యాన్ని సాధించి రాష్ట్రంలో ఏడో స్థానంలో ఉన్నామని కలెక్టర్ తెలిపారు. మత్స్య శాఖ అభివృద్ధికి అనేక చర్యలతో పాటు నీల్వాయి. గొల్లవాగు, ఎల్లంపల్లి నీటి లభ్యత ఎక్కువగా ఉన్న చోట తప్పనిసరిగా మత్స్య సహకార సంఘాలు సంబంధిత ప్రజా ప్రతినిధులతో కలిసి చేప పిల్లలను వేసేటప్పుడు పంచాయతీ సెక్రెటరీ, విలేజ్ రెవెన్యూ అధికారి, వ్యవసాయ అధికారుల సమన్వయంతో చేప పిల్లలను వేయాలని అధికారులను ఆదేశించారు. వినాయక చవితి సందర్భంగా ఆయా చెరువుల్లో నిమజ్జనం అయ్యే ప్రదేశాలను గుర్తించి, సంబంధిత తహసీల్దార్, అధికారులతో కలిసి నీటి వనరుల ఏర్పాటు చేసుకోవాలన్నారు. గుడుంబా తయారీ కుటుంబాలను ఆదుకోవడానికి ఎక్సైజ్ సంక్షేమ శాఖ పూర్తి స్థాయిలో తగు ప్రణాళికలు తయారు చేసుకొని లక్ష్యం సాధించాలన్నారు. వ్యవసాయ ఉద్యాన వన పంటలు, పండ్ల ఉత్పత్తి కూరగాయాలు పండించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ప్రియాంక, ఆర్డీఓ శ్యామలాదేవి, ముఖ్య ప్రణాళిక అధికారి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్వీ కర్ణన్

మంచి తరుణం.. మించి పోతోంది!

❖ ఆదిలాబాద్ జిల్లాలో పూర్తిగా నిలిచి పోయిన 'హరితహారం' ❖ లక్ష్యం కోటీ 47లక్షలు.. ఇప్పటి వరకు నాటింది 51 లక్షలు మాత్రమే..

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహార పథకం ఆదిలాబాద్ జిల్లాలో అబాసు పాలవతోంది. మొక్కలు నాటేందుకు మంచి తరుణం మించి పోతున్నా అధికార యంత్రాంగంలో కదలిక కనిపించడం లేదు. ఇప్పటికే మొదటి, రెండవ దశల్లో చేపట్టిన పథక అమలు తీరుపై పలు విమర్శలు వచ్చాయి. కానీ అధికారుల తీరులో మాత్రం మార్పు కనిపించడం లేదు. మొక్కల పెంపకానికి ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్న క్షేత్ర స్థాయిలో అమలుకు నోచుకోక ముందుకు సాగడం లేదు. గత నెల రోజులుగా వర్షపు జాడ లేక పోవడంతో పథక అమలు అర్థాంతరంగా నిలిచి పోయింది.

● ప్రస్తుతం జోరుగా వానలు

కానీ, గత వారం రోజులుగా జిల్లావ్యాప్తంగా సమృద్ధిగా ముసురు వర్షాలు కురుస్తున్నాయి. ఇలాంటి తరుణంలోనే మొక్కలు నాటితే మంచి ఫలితాలు ఉంటాయి. ప్రస్తుతం ఎక్కడ మొక్కలు నాటే కార్యక్రమం కనిపించడం లేదు. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడంలో పలు శాఖలు విఫలమవుతూనే ఉన్నాయి. ఇప్పటి వరకు కొన్ని శాఖలు హరితహారం కార్యక్రమాన్ని మొదలు పెట్టనేలేదు. జిల్లా విభజన తర్వాత జిల్లాలో లక్షా 874 హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఈ లెక్కన జిల్లాలో 47శాతం అటవీ ప్రాంతం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అధికారుల లెక్కలకు క్షేత్ర స్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా పోతోందంటున్నారు. జూలై 12నుంచి మూడవ దశ హరితహారం కార్యక్రమం ప్రారంభమై 40 రోజులు గడిచి పోయిన నిర్ణీత లక్ష్యాన్ని చేరుకోవడంలో అధికారులు నిండు నిర్లక్ష్యాన్ని చూపుతున్నారు. ఈసారి జిల్లావ్యాప్తంగా కోటీ 47లక్షల మొక్కల పెంపకాన్ని లక్ష్యంగా పెట్టుకున్న అధికారులు ఇప్పటి వరకు 51లక్షల 753 మొక్కలను మాత్రమే నాటారు. సంరక్షణ సాధ్యమయ్యే ప్రదేశాల పైననే మొక్కలను నాటేందుకు దృష్టి సారిస్తున్న ప్రయోజనం కనిపించడం లేదు. ఎక్కడ పడితే అక్కడ గుంతలు తవ్వి నిర్లక్ష్యంగా వదిలేశారే తప్ప మొక్కలు నాటడం లేదు. ఇవే పరిస్థితులు కొనసాగితే ఈసారి కూడా జిల్లాలో హరితహారం పరిస్థితి అధ్వానంగా మారనుంది.

● విఫలమవుతున్న అధికారులు

హరితహారం కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జ్యోతిబుద్ధ ప్రకాష్ పలుమార్లు అధికారులతో సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసిన ఫలితం కనిపించడం లేదు. మూడవ దశలో కూడా అధికారులు అదే నిర్లక్ష్యాన్ని కనబరుస్తూ నిర్ణీత లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలమవుతునే ఉన్నారు. జిల్లాలోని వివిధ శాఖల లక్ష్యం కోటీ లక్ష మొక్కలను నాటాల్సి ఉండగా ఇప్పటి వరకు 50 లక్షల 88వేల 690 మొక్కలను మాత్రమే నాటారు. డీపీవో అధికారులు 9470 మొక్కలు, డీఎఫ్‌వో కార్యాలయ అధికారులు 2లక్షల 45వేల 500 మొక్కలు, పీవో ఐటీడీఏ ఉట్నూర్ 6లక్షల 20వేల మొక్కలు, విద్యుత్ శాఖ 445 మొక్కలు నాటాల్సి ఉండగా ఇప్పటి ఒక మొక్కను కూడా నాటలేదు. అడవుల మంత్రి సొంత జిల్లాలోనే మొక్కల సంరక్షణపై అధికారులు నిర్లక్ష్యం వహించడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతేడు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 89లక్షల 29వేల మొక్కలను నాటగా కేవలం 30శాతం మేరకే మొక్కలు బతికినట్లు అధికారుల లెక్కలే చెబుతున్నాయి. ఈ సారి కూడా 51శాతం మొక్కలు మాత్రమే నాటినట్లు అధికారులు చెబుతున్నారు. నాటిన మొక్కలకు సంరక్షణ లేక పోవడంతో దాదాపు 20శాతం మొక్కలు గల్లంతైనట్లు తెలుస్తోంది. ట్రీగార్డ్స్ ఏర్పాటు చేయకుండానే వదిలేయడంతో పశువులు, మేకలకు మేతగా మారుతున్నాయి. లక్షలు వెచ్చించి మొక్కలను నాటిన ప్రయోజనం ఏమిటన్న ప్రశ్నలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

● నర్సరీల్లోనే పెరుగుతున్న మొక్కలు

ఈయేడు జిల్లావ్యాప్తంగా కోటి 47లక్షల మొక్కల పెంపకాన్ని లక్ష్యంగా పెట్టుకున్న అధికారులు అటవీశాఖ ఆధ్వర్యంలో 96నర్సరీలు, అలాగే డీఆర్డీఏ ఆధ్వర్యంలో 26 నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచారు. అయిన ఇప్పటి వరకు 51 శాతం మొక్కలను మాత్రమే నాటడంతో సగానికి పైగా మొక్కలు నర్సరీల్లోనే ఏపుగా పెరుగుతున్నాయి. కొన్ని రకాల మొక్కల వేర్లు భూమిలోకి చొచ్చుకొని వెళ్లడంతో తరలించేందుకు ఇబ్బందులు తలెత్తే అవకాశం కనిపిస్తోంది. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో మొక్కలు నాటేందుకు తవ్విన గుంతలు కురుస్తున్న వర్షాలకు పూడుక పోతున్నాయి. దీంతో గతేడు పరిస్థితులే మళ్లీ పునరావృతమవుతున్నాయి. ఇకనైనా జిల్లా హరితహరంపై అడవుల మంత్రి జోగు రామన్న ప్రత్యేక దృష్టి సారిస్తేనే లక్ష్యం నెరవేరే అవకాశం ఉంది.

● కనిపించని సంరక్షకులు

హరితహారం అనగానే హడావిడిగా మొక్కలు నాటేయడం, ఆపై చేతులు దులుపుకోవడమే తప్పా అనుకున్న స్థాయిలో మొక్కల పెంపకం జరుగడం లేదన్న అపవాదులు వస్తున్నాయి. హరితహరం కార్యక్రమంలో నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించాల్సి ఉంటుంది. కానీ, అలాంటి పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు. ఒక్కో మొక్క రక్షణకు రూ.5 చెల్లించి 400 మొక్కల బాధ్యతను ఒక వ్యక్తికి అప్పగించాల్సి ఉంది. కాని నిర్వహణ, కూలీ బిల్లులు సకాలంలో చేతికి అందక పోవడంతో గాలికొదిలేస్తున్నారు. ప్రతినిత్యం అధికారులు మొక్కల ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉంటుంది. అధికారులు కార్యాలయాలకే పరిమితం కావడంతో కిందిస్థాయి సిబ్బంది చెప్పిందే లెక్క అన్నట్లుగా మారుతుంది. రికార్డుల్లో ఉన్న మొక్కల లెక్కలకు క్షేత్ర స్థాయిలో ఉన్న మొక్కలకు ఎలాంటి పొంతన లేకుండా పోతుంది. అసలు సరిపడా నీటివసతి, సంరక్షణ సౌకర్యం ఉన్న చోట మొక్కలను నాటాల్సి ఉంటుంది. అయితే అధికారులకు ముందు చూపు కరువవడంతో ఇష్టారాజ్యంగా మొక్కలను నాటి వదిలేస్తున్నారు. ఇకనైనా మొక్కల పెంపకంతో పాటు వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

● వివిధ శాఖల వారీగా నాటాల్సిన మొక్కల వివరాలు..

శాఖ పేరు	నాటాల్సిన మొక్కల లక్ష్యం	నాటిన మొక్కలు	మిగిలినవి
విద్యాశాఖ	31451	26151	5300
దేవాదాయ శాఖ	3955	644	3311
పంచాయతీరాజ్	9470	0	9470
ఎస్సీ కార్పొరేషన్	1582	257	1325
మున్సిపాలిటీ	3లక్షలు	లక్షా 99,900	లక్షా100
మహిళా శిశు సంక్షేమ	5205	1224	3981
పశు సంవర్ధక	1185	550	635
విద్యుత్‌శాఖ	445	0	445
నీటిపారుదల	34194	9930	24264
ఆర్అండ్‌బీ	27780	1900	25880



జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో మొక్కలు నాటేందుకు తవ్వి వదిలేసిన గుంతలు

● జియో ట్యాగింగ్ చేసినా.. ప్రయోజనం సున్న

గతంలో లేనివిధంగా ఈసారి మొక్కల రక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే నాటిన ప్రతీ మొక్కకు జియోట్యాగింగ్ చేశారు. అయిన సంరక్షణ చర్యలు చేపట్టక పోవడంతో జియో ట్యాగింగ్ విధానం కూడా మున్నాళ్ల ముచ్చటగానే మారి పోయింది. జియోట్యాగింగ్‌తో మొక్కల లెక్కలు పక్కాగా ఉన్న క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. కానీ నాటిన కొద్ది రోజులకే మొక్కలు కనిపించకుండా పోవడంతో జియో ట్యాగింగ్‌పై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నాటిన మొక్కలన్నింటిని జియోట్యాగింగ్ చేయడం ద్వారా ఎప్పటికప్పుడు వాటి స్థితిగతులను తెలుసుకునే అవకాశం ఉంది. కానీ అధికారుల పర్యవేక్షణ కరువవడంతో పట్టించుకునే నాథుడే కరువవుతున్నాడు. జిల్లా కేంద్రంలోని పలు పరిశ్రమల ఆవరణలో మొక్కలు పెంచేందుకు ఆసక్తి చూపడం లేదు. పాఠశాలలు, కళాశాలల్లో పెద్ద ఎత్తున హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కల పెంపకం ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయి. ఇప్పటికే గ్రామ స్థాయిలో మొక్కల సంరక్షణ బాధ్యతను గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులకు అధికారులు అప్పగించారు. అయినా హరితహారంపై అవగాహన కరువై ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారుతోంది.

(- ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్)

తొలగనున్న 'దీపం-జాప్యం'!

◆ మంజూరు చేసే అధికారం తహసీల్దార్‌లకే ◆ ఎంపీడీవోల నుంచి తప్పించిన ప్రభుత్వం

పేద బలహీ వర్గాల కోసం.. పంపిణీ చేసే దీపం పథకంలో విప్లవాత్మక నిర్ణయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయబోతున్నాయి. ఈ మేరకు గతంలో ఎంపీడీవోల ద్వారా దీపం పథకం ద్వారా లబ్ధిదారులను ఎంపిక బాధ్యత నిర్వహిస్తుండగా.. తాజాగా పౌర సరఫరాల శాఖ ఆయా మండలాలకు చెందిన తహసీల్దార్‌లకు దీపం పథకం లబ్ధిదారులను ఎంపిక చేసే బాధ్యతను అప్పగించింది. ప్రభుత్వం ధారిద్రరేఖక దిగువన ఉన్న వారికి దీపం పథకం ద్వారా గ్యాస్ సిలెండర్‌లను పంపిణీ చేస్తోంది. ఇప్పటి వరకు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఎంపీడీవోలకు నివేదిక పంపించగా వారు ఆయా గ్రామాలకు వెళ్లి లబ్ధిదారులు అర్హులేనా? కాదా? అని నిర్ధారించేవారు. ఆ తరువాత ఆ జాబితాను జిల్లా పౌర సరఫరా విభాగానికి పంపించి లబ్ధిదారుల వివరాలను అందజేస్తారు. అయితే ఇటీవల సంవత్సరాల తరబడి దీపం పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు గ్యాస్ సిలెండర్‌ల మంజూరులో తీవ్ర జాప్యం జరిగేది. ప్రభుత్వం అడవుల్లో లభించే వంట చెరుకుపై ఆధారపడే వారితో పాటు దారిద్ర రేఖకు దిగువ ఉన్న వారి సౌకర్యార్థం కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. నిర్మల్ జిల్లాలో 19 మండలాలకు గాను గ్యాస్ సరఫరా చేసే ఏజెన్సీలు 11 అందుబాటులో ఉన్నాయి. ప్రధానంగా నిర్మల్, ఖానాపూర్, భైంసా ప్రాంతాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు సిలెండర్‌లను సరఫరా చేస్తారు. ఇప్పటి వరకు నిర్మల్ జిల్లాలో 11,963 గ్యాస్ సిలెండర్‌లను దీపం పథకం కింద పంపిణీ చేసినట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. మరో 7200 లబ్ధిదారులకు అందించేందుకు గానూ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు. ప్రధానంగా జిల్లాలో హెచ్‌పీ గ్యాస్ కంపెనీలు 2, ఐవోసీ కంపెనీలు 6, బీపీసీ కంపెనీలు 3 జిల్లావ్యాప్తంగా గ్యాస్ సిలెండర్‌లను లబ్ధిదారులకు అందజేస్తున్నాయి. దీపం పథకం లబ్ధిదారుల కోసం జాప్యాన్ని నివారించేందుకు అదనపు కోటాను కూడా కేటాయించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

● లబ్ధిదారుల ఎంపిక తహసీల్దార్‌లదే..

కొత్తగా ప్రభుత్వం దీపం పథకం కింద లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను ఆయా మండల తహసీల్దార్‌లకు అప్పగించింది. దీంతో గతంలో ఉన్న పనులతో పాటు దీపం పథకం లబ్ధిదారుల ఎంపిక బాధ్యత కూడా వారికే ఇవ్వడంతో మరింత పని భారం పెరగనుంది. ఇప్పటి వరకు ఆ బాధ్యతను నిర్వహించిన ఎంపీడీవోలను లబ్ధిదారుల ఎంపికకు దూరంగా ఉంచడంతో కీలకమైన దీపం పథకం రెవెన్యూ శాఖకు మారింది. ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శుల ద్వారా కొత్తగా దీపం పథకం లబ్దిదారుల ఎంపిక చేసేందుకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదలకానున్నాయి. ఇప్పటి వరకు ఈ పథకం మంజూరులో రాజకీయ జోక్యం చోటు చేసుకోగా కొత్తగా మారిన విధానం ప్రకారం దీపం పథకం మంజూరులో పారదర్శకత ఉంటుందని భావిస్తున్నారు. గతంలో దీపం పథకం కోసం గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా పట్టణ ప్రాంతాలకు చెందిన దారిద్ర రేఖకు దిగువన ఉన్న వారు ఆయా మున్సిపాలిటీల్లో దరఖాస్తు చేసుకునే వారు మారిన ఉత్తర్వులతో మండల రెవెన్యూ కార్యాలయాల్లోనే దీపం పథకం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వీరు సిలెండర్‌కు రూ.1450 చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పాటు అదనంగా రూ. 150 రెగ్యూలేటర్ కోసం చెల్లించాలి. గిరిజన ప్రాంతాల లబ్ధిదారులు సిలెండర్‌కు 800, రెగ్యూలేటర్‌కు రూ.150 చెల్లించాల్సి ఉంటుంది.

● ఉత్తర్వులు అందిన తర్వాతే సమావేశం

- సుదర్శన్, జిల్లా సివిల్ సప్లై అధికారి

ప్రభుత్వం నూతనంగా దీపం పథకం లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను తహసీల్దార్‌లకు అప్పగించినందున ఉత్తర్వులు రాగానే దాని అమలు కోసం సంబంధిత తహసీల్దార్‌లతో సమావేశం నిర్వహించి విధి విధానాలు తెలియజేస్తాం. ఇప్పటి వరకు మండల పరిషత్‌లే ఈ బాధ్యతలను నిర్వర్తించింది. దీపం పథకం సక్రమంగా అమలు చేసేందుకు గాను ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుకూలంగా లబ్ధిదారులకు జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటాం.

(- ఆంధ్రజ్యోతి, నిర్మల్)



'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకం

దశ మారనున్న కుంటాల

◆ రూర్బన్ మిషన్ పథకానికి ఎంపిక ◆ మండల అభివృద్ధికి భారీగా నిధులు ◆ గ్రామంలో పట్టణ తరహా వసతులు

కుంటాల: కేంద్ర ప్రభుత్వం ఇటీవల మూడవ విడత రూర్బన్ పథకంలో కుంటాల మండలాన్ని ప్రకటించడంతో మండల దశ మారనుంది. నూతనంగా ఏర్పడిన నిర్మల్ జిల్లాలో కుంటాల మండలాన్ని ఎంపికచేశారు. ఈ రూర్బన్ పథకంలో రాష్ట్రంలోని తొమ్మిది మండలాలు ఎంపికకాగా అందులో కుంటాల మండలం ఒకటి. ఈ పథకంలో ఎంపికైన మండలంలోని గ్రామాలలో పట్టన తరహా వసతులు కల్పించనున్నారు. కేంద్ర ప్రభుత్వం 60శాతం, రాష్ట్రప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయించి గ్రామాలలో అన్నిరకాల మౌలిక వసతులను కల్పించనున్నారు. మోదీ ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతోనే శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్ పథకానికి కేంద్రప్రభుత్వం కుంటాల మండలాన్ని ఎంపికచేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే నిధులతో కుంటాల మండలం మరింత అభివృద్ధి దశలో పయనించనుంది. ఈ పథకానికి కలెక్టర్ చైర్మన్‌గా, డీఆర్‌డీవో నోడల్ అధికారిగా పనులను చేపట్టనున్నారు.

● గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా..

నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వం గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందన్న ఉద్దేశంతో గ్రామాలను అభివృద్ధి పరచాలని, గ్రామస్థులకు పట్టణస్థాయి సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో రూరల్, అర్బన్ పథకాలను కలిపి రూర్బన్ పథకాన్ని రూపొందించారు. జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్‌గా ఈ పథకానికి పేరుపెట్టారు.

● మూడవ విడతలో ఎంపిక

గత కొద్ది రోజుల క్రితం రాష్ట్ర మంత్రులు, ఎంపీలు ఢిల్లీకి వెళ్లినప్పుడు రాష్ట్రంలోని మరిన్ని మండలాలను రూర్బన్ మిషన్ పథకంలో చేర్చాలని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నరేంద్రసింగ్‌ను కోరారు. అంతేగాకుండా రాష్ట్రం నుంచి ప్రతిపాదనలు కూడా పంపినట్లు తెలుస్తుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన మూడవ విడత రూర్బన్ మిషన్ పథకంలో నిర్మల్ జిల్లా నుండి కుంటాల మండలాన్ని గిరిజన జనాభాకు అనుగుణంగా ఎంపికచేయడం జరిగినట్లు తెలుస్తోంది. కుంటాల మండలం మహారాష్ట్ర సరిహద్దులో ఉండడం, ఈ మండలం వెనుకబడిన మండలంగా పేరుండడం, అభివృద్ధిలో అంతంత మాత్రంగానే ఉండడం కాగా, గిరిజన తండాలు సైతం అధికంగా ఉండడంతో ఈ పథకానికి ఎంపికైనట్లు తెలుస్తోంది.

● దశల వారీగా అభివృద్ధి పనులు

గ్రామీణ ప్రాంతాలతో పట్టణంలో మాదిరిగా అన్నిరకాల సౌకర్యాలను కల్పించడంతో పాటు గ్రామాల్లోని ప్రజల వలసలను నిలువరించే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం ఈ రూర్బన్ మిషన్ పథకాన్ని అమలు చేస్తోంది. కుంటాల మండలాన్ని ఒక క్లస్టర్‌గా ఎంపిక చేసి అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుంది. ఈ పథకం కింద మండలానికి సత్వరమే 15 నుంచి 20 కోట్ల రూపాయల వరకు నిధులు సైతం కేటాయించవచ్చు. ఈ పథకం అభివృద్ధికి రాష్ట్రం కూడా కొన్ని నిదులను కేటాయించనుంది. గ్రామంలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచి వివిధ శాఖల ఆధ్వర్యంలో యువతకు జీవనోపాధిపై శిక్షణ ఇవ్వడంతో పాటు రైతులకు ఆధునిక పద్ధతులతో పంటలు సాగుచేసే విధానం, గ్రామాలలో శుద్దజలం, ఎల్ఈడీ బల్బులు, మెరుగైన రవాణా సౌకర్యం, మురికి కాలువల నిర్మాణం, అంతర్గత రోడ్ల నిర్మాణం, ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతులు, తదితర అభివృద్ధి పనులను దశలవారీగా ఈ పథకం చేపట్టనున్నారు.

● శిక్షణ కోసం హైదరాబాద్‌కు అధికారులు

రూర్బన్ మిషన్ పథకానికి కుంటాల మండలం ఎంపిక కాగా, ఈ పథకం అమలు తీరును పర్యవేక్షించేందుకు కలెక్టర్ చైర్మన్‌గా, డీఆర్‌డీవో నోడల్ అధికారిగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు 24వ తేదీన డీఆర్‌డీవో, ఏపీడీ, ఎంపీడీవో, ఈసీలు ఒక రోజు శిక్షణలో భాగంగా హైదరాబాద్ వెళ్లనున్నారు. ఇప్పటికే వీరికి రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ కార్యాలయం నుంచి సమాచారం అందింది.

● అన్ని శాఖల సమన్వయంతోనే అభివృద్ధి
- డీఆర్‌డీవో వెంకటేశ్వర్లు

కుంటాల మండలం రూర్బన్ మిషన్ పథకానికి 2011 గిరిజనుల జనాభాకు అనుగుణంగా ఎంపికైంది. ఈ పథకం ద్వారా గ్రామంలో ప్రజలకు అన్నిరకాల మౌలిక వసతులు కల్పించడం జరుగుతుంది. ఇందుకు అన్ని శాఖల సమన్వయంతో అభివృద్ధి చేపట్టడం జరుగుతుంది. పంచాయతీ రాజ్, అంగన్‌వాడీ, వీధి దీపాలు, విద్య, మరుగుదొడ్లు, రోడ్ల సౌకర్యం, పాఠశాల భవనాలు, త్రాగునీరు తదితర వాటి కొరకు సంబంధిత శాఖలు సగం నిధులు భరిస్తే మరో సగం రూర్బన్ పథకం నుండి నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుంది. మూడవ విడతలో రాష్ట్రంలో 9 మండలాలు ఎంపిక కాగా, అందులో నిర్మల్ జిల్లా నుంచి కుంటాల మండలం ఎంపికకావడం గమనార్హం.

● రూర్బన్ మిషన్‌తో గ్రామంలో మౌలిక వసతుల మెరుగు
- ఎంపీడీవో, శ్రీనివాస్‌రావు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూర్బన్ మిషన్ పథకంలో కుంటాల మండలం ఎంపికకావడంతో గ్రామాలలో ప్రజలకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతుల కల్పించడం జరుగుతుంది. ఇందుకు సంబంధించి ఈనెల 24న శిక్షణ కోసం హైదరాబాద్‌కు వెళ్తున్నాం.

● యువతకు ఉపాధి : సవ్వి అశోక్‌రెడ్డి, సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, లింబా(కె)



రూర్బన్ మిషన్ పథకంలో మా మండలం ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. ఈ పథకం ద్వారా యువతకు ఉపాధి శిక్షణ, రైతులకు నూతన పద్ధతులు, గ్రామాలలో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగితే కుంటాల మండలం అన్నింటా అగ్రగామిగా నిలువనుంది.

అమ్మవారి విగ్రహం దొరికినట్లే?

● బాసర ఆలయ ఉత్సవ విగ్రహంపై వీడిన ఉత్కంఠ
● పండితుని బీరువాలోనే లభ్యం ● రికార్డుల్లో లేని విగ్రహ వివరాలు

బాసర: బాసర సరస్వతీ దేవాలయంలో ఉత్సవ విగ్రహం మాయంపై ఉత్కంట వీడింది. ఆలయ పండితులు దేవస్థానం నుంచి విగ్రహాన్ని నల్గొండ జిల్లా దేవరకొండకు తీసుకెళ్లి అక్కడ ప్రైవేటుగా పూజలు నిర్వహించిన ఘటనపై పోలీసు విచారణలో కీలక విషయాలు వెలుగుచూశాయి. ఘటన జరగగానే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్ కుమార్ ఆధీనంలోని రెండు బీరువాలను సీజ్ చేశారు. సదరు పూజారి ఆనాటి నుంచి అజ్ఞాతంలో ఉండడంతో సోమవారం స్థానిక తహసీల్దార్ వెంకటరమణ, ముథోల్ సీఐ రఘుపతి, ఆలయ ఈవో సుధాకర్‌రెడ్డి సమక్షంలో సీజ్ చేసిన రెండు బీరువాల తాళాలను పగులగొట్టారు. పంచనామా నిర్వహించి అందులో ఉన్న వస్తువులను నమోదు చేసుకున్నారు. ఆలయం ప్రాంగణంలోని స్టోరేజ్ గదిలో గల బీరువాలో వెడిపాత్రలు, అమ్మవారికి అలంకరించే బంగారం, వెండి చిన్నచిన్న ఆభరణాలు, పూజకు వినియోగించే ఇతర వస్తువులు లభించాయి. ఇవన్నీ అమ్మవారి నిత్యపూజకు వినియోగించే వస్తువులు కావడంతో పండితుల ఆధీనంలోనే ఉంటాయి. అర్చకుల విశ్రాంతి గదిలో ఉన్న మరో బీరువాను పగులగొట్టి తెరవగా అందులో కిలోకు పైగా బరువున్న అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని కనుగొన్నారు. దీంతో పాటు పలకలు, నోట్‌బుక్‌లు, వీఐపీలకు సత్కరించే శాలువాలు, కొంత నగదు విచారణ అధికారులకు లభించాయి. అయితే బీరువాలో లభించిన విగ్రహం.. దేవరకొండ పూజకు తీసుకెళ్లింది ఒకటేనా? కాదా? అనేది విచారణలో తేలనుందని అధికారులు తెలిపారు. గతనెల 28వ తేదీన నల్గొండ జిల్లా దేవరకొండలో పూజలు నిర్వహించిన ఘటనపై ఆలయ ప్రధాన అర్చకులు సంజీవ్‌కుమార్, రుత్వికుడు ప్రణవ్ అనే ఇద్దరు పండితులను అధికారులు సస్పెండ్ చేసిన విషయం తెలిసినదే. అలాగే, వీరిద్దరిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇదే ఘటనలో మరో పూజారి పాత్రపై 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. సదరు మూడవ పూజారిపై చర్యల కోసం దేవస్థాన అధికారులు దేవాదా య శాఖ కమిషనర్‌కు నివేదిక పంపారు.



నల్గొండ జిల్లా దేవరకొండలో పూజకు వినియోగించిన విగ్రహం

● విగ్రహం చుట్టూ అనుమానాలు..

అధికారుల విచారణలో దేవస్థాన పరిపాలన లోపాలు, పండితుల ఇష్టారాజ్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. రికార్డుల ప్రకారం ఉండాల్సిన 8విగ్రహాలున్నాయని ఆలయ అధికారులు, పండితులు ఇప్పటికే ప్రకటించారు. మరి సోమవారం జరిపిన బీరువా తనిఖీల్లో దొరికిన విగ్రహం ఎక్కడిది? ఎక్కడి నుంచి వచ్చింది? అనే వివరాలు ఆలయ అధికారుల వద్ద లేవు. ఒకవేళ భక్తులు బహూకరిస్తే రికార్డుల్లో ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చిన్న వస్తువును భక్తులు విరాళంగా అందిస్తేనే రికార్డుల్లో నమోదు చేయాల్సిన నిబంధనలు ఉన్నప్పటికీ విలువైన ఈ విగ్రహం వివరాలు దేవస్థానం వద్ద లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. రికార్డు ప్రకారం విగ్రహాలన్నీ ఉన్నాయని చెప్పిన అదికారులే విగ్రహం అదృశ్యమైందని పండితులపై ఫిర్యాదు చేశారు. దీనిపై విగ్రహానికి సంబంధించిన పూర్తి రికార్డు వివరాలను అందజేయాలని పోలీసులు ఆలయ అధికారులకు కోరినట్లు సమాచారం. ఇప్పటివరకు దేవస్థాన అధికారులు విగ్రహానికి సంబంధించిన వివరాలు పోలీసులకు తెలపకపోవడంపై కూడా అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే స్టోర్ రూం బీరువాలో నుంచి పండితుడు విగ్రహాన్ని తీసుకెళ్లాడని దేవస్థాన స్వీపర్ ఆలయ అధికారులకు లిఖిత పూర్వకంగా రాసిచ్చింది. సోమవారం మాత్రం విగ్రహం స్టోర్ రూంలో గల బీరువాలో కాకుండా పండితుల విశ్రాంతి గదిలోని బీరువాలో లభించింది. ఈ ఘటనపై ఇలా ప్రతీది పొంతన లేకుండా విషయాలు వెలుగుచూస్తున్నాయి. అసలు విగ్రహంపై దేవస్థాన అధికారులకే స్పష్టత లేదని తెలుస్తుంది.

ఫిర్యాదుల విభాగంలోని దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్ ఇలంబరిది

నిర్మల్ టౌన్: ప్రజా ఫిర్యాదుల విభాగంలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలంబరిది అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కాగా, ఫిర్యాదులను ఆయా శాఖలకు అధికారులు అందించి త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సంబంధిత కేసులు, ఎస్సీ, ఎస్టీ, కల్యాణలక్ష్మి, డబుల్ బెడ్‌రూం, ఒంటరి మహిళ, బీడీ కార్మికులు, వృద్ధాప్య, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించిన వాటి కోసం అర్జీలు పెట్టుకున్న వారి దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి లబ్ధి చేకూరే విధంగా అధికారులు ఆదేశాలు జారీ చేయాలన్నారు. అలాగే ఇప్పటి వరకు పలు శాఖలకు వచ్చిన అర్జీల విషయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి లబ్ధిదారులకు న్యాయం జరిగేలా అధికారులకు సూచించామని, అర్హులైన వారికి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. ఈ నెల 17నుంచి సెప్టెంబర్ 25వరకు ఎంఆర్ టీకాలు పిల్లల ఆరోగ్య విషయం గురించి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కార్యక్రమం నిర్వహిస్తున్నందున అధికారులు ప్రత్యేకశ్రద్ధతో తల్లిదండ్రులకు ప్రోత్సహించి టీకాలను వేయించాలన్నారు. కార్యక్రమంలో జేసీ శివలింగయ్య, డీఆర్వో నగేష్, ఆర్డీవో ప్రసునాంబ, తహసీల్దార్ శంకర్, డీటీ కిరణ్మయి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



హాజరైన ఆయా శాఖల అధికారులు

భక్తిశ్రద్ధలతో పొలాల అమావాస్య

భైంసా: డివిజన్ పరిధిలోని రైతులు సోమవారం పొలాల అమావాస్య పండుగను భక్తిశ్రద్ధల మధ్య ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆయా ప్రాంతాలకు చెందిన అన్నదాతలు బసవన్నలను శోభయమానంగా అలంకరించారు. సాయంత్రం వేళలో తమ తమ ప్రాంతాల్లోని హన్మాన్ ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేపట్టి బసవన్నలను ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు నిర్వహింప చేశారు. భైంసా పట్టణ అన్నదాతలు తమ బసవన్నలను కిసాన్‌గల్లీలోని హన్మాన్ మందిరం వద్ద పూజలు నిర్వహించి ప్రదక్షిణలు చేయించారు. ముందుగా పట్టణంలో భట్టిగల్లీకి చెందిన రైతుల బసవన్నలకు స్థానిక నేతాజీ యువజన సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి హరతులను అందించి వేడులకలను ప్రారంభించారు. అనంతరం ఒక్కో కాలనీవారు తమ తమ బసవన్నలకు కిసాన్‌గల్లీ హన్మాన్ మందిరానికి తీసుకవచ్చి ప్రదక్షిణలు జరిపి పూజలు చేపట్టారు. అనంతరం అన్నదాతలు బసవన్నలను ఇంటికి తీసుకవెళ్లి కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. హారతులను అందించి నైవేద్యాలను సమర్పించారు. మట్టితో చేసిన బసవన్నలకు ఇళ్లలో ప్రత్యేకంగా ఆలంకరించి పూజలు చేపట్టారు. పొలాల అమావాస్య సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భైంసా టౌన్ సీఐ రఘు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నేతాజీ యువజన సంఘం ప్రతినిధులు ఆయా కాలనీల్లోని ఉత్తమ రైతులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.



భైంసాలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పూజలు

పెంబి: మండలంలోని పెంబి, పస్పుల్లా, ఇటిక్యాల్, శెట్‌పల్లి, వెంకం పోచంపాడ్, మందపల్లి గ్రామాల్లో సోమవారం పొలాల అమవాస్యను పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. రైతులు ఉదయాన్నే బసవన్నలను స్థానిక చెరువులో స్నానం చేయించి ఎలాంటి పనులు చెప్పకుండా బసవన్నలను రంగురంగుల గొండాలతో అలంకరించారు. అనంతరం స్థానిక హనుమాన్ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అనంతరం బసవన్నలకు నైవేద్యంగా వండుకున్న బూరెలను తినిపించారు.



● ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో అనర్థాలు..

- ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో ఆకర్షణీయంగా రూపొందించే భారీ విగ్రహాలు పర్యావరణానికి పెనుముప్పుగా మారాయి.
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల్లో జిప్సమ్, సల్ఫర్, పాస్ఫరస్, మెగ్నీషియం మూలకాలు ఉండడం వల్ల నీటిలో కరుగవు.
- ఈ పదార్థాలు చెరువు అడుగుభాగానికి చేరుకొని నీరు భూమిలోకి ఇంకకుండా అడ్డుపడతాయి.
- విగ్రహాలకు వేసే రంగుల్లో కాడ్మియం, సిలికాన్, పాదరసం, సీసం, కర్బనం, మాలిబ్డినం, అర్జినిక్, క్రోమియం లాంటి లోహాలు కలిసి ఉంటాయి.
- నిమజ్జనం జరగగానే నీటిలో అమ్లత్వం పెరుగుతుంది. భార లోహాల సాంద్రత పెరిగి చేపలు చనిపోతాయి.
- మంచి నీటి మొక్కలకు, వాటిని తిని బతికే జీవులకు, మొత్తంగా పర్యావరణ చక్రానికి ఈ రసాయనాలు



హానిచేస్తాయి.
- మంచినీటి చెరువులో నిమజ్జనం చేయడం ద్వారా మనుషులకు శ్వాస సంబంధ, చర్మ సంబంధ వ్యాధులతోపాటు కిడ్నీ, కాలేయ, క్యాన్సర్‌లాంటి రోగాలు వస్తాయి.
- భూగర్భ జలాలు సైతం కలుషితమవుతాయి.
- మనం నేరుగా ఈ నీటిని తాగకపోయినా, వాటిని తిని పెరిగిన చేపలను తిన్నా రోగాలపాలవుతాము.
- ఈ వేడుకల్లో చల్లుకునే కృత్రిమ రంగులలో కాపర్ సల్ఫేట్, లెడ్ ఆక్సైడ్, మెర్క్యూరీ సల్ఫేట్ తదితర మూలకాలుంటాయి.
- సింథటిక్ రంగులతో కంటిచూపు పోయే ప్రమాదముంది.
- మట్టి గణపతులతో ఎంతో మేలు..
- మట్టి గణపతుల వల్ల పర్యావరణానికి ఎలాంటి హానీ కలగదు.
- మట్టితో సైతం ఆశించిన ఎత్తులో గణేష్ ప్రతిమలను తయారు చేయవచ్చు.
- సహజ రంగులను వాడటం వల్ల నీటి కాలుష్యానికి ఆస్కారముండదు.
- సహజ రంగులు భూమిలో సహజంగా కలిసిపోయి ఇంకిపోతాయి.

'ఏకో'దంతుడే మేలు!

భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనంగా నిలుస్తున్న గణేశ్‌నవరాత్రోత్సవాలు, ప్రజల్లో సుఖసంతోషాలకు కారణం కావాలిగానీ, పర్యావరణ కాలుష్యానికి కాదు! ఒకప్పుడు మట్టి, పిండితో చేసిన వినాయక విగ్రహాలనే పూజించేవారు. కానీ గడిచిన మూడు దశాబ్దాలుగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో రూపొందించిన విగ్రహాలను వాడ వాడలా ప్రతిష్ఠిస్తుండడం, వాటిని చెరువుల్లో నిమజ్జనం చేస్తుండడం వల్ల పర్యావరణానికి హాని కలుగుతున్నది. ముఖ్యంగా తాగునీరు కలుషితమవుతున్నది. తద్వారా మానవులు సహా జలచరాలకు, ఇతర ప్రాణికోటికి ముప్పు వాటిల్లుతున్నది. అందువల్ల ఇకనైనా అందరూ కళ్లు తెరిచి, మట్టి, సహజ రంగులతో రూపొందించిన విగ్రహాలనే పూజించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

◆ భైంసా

● మట్టి విగ్రహాన్ని ఆకర్షణీయంగా..

- మట్టి విగ్రహాన్ని ఆకర్షణీయంగా ఇలా తయారుచేయవచ్చు..
- మనకు కావాల్సిన విగ్రహాల సైజుకు అనుగుణంగా వేస్టు పేపర్‌ను చించాలి. దీనిని రోజంతా నీటిలో నానబెట్టాలి.
- నానబెట్టిన పేపరును మరుసటి రోజు గ్రైండరులో వేసి రుబ్బాలి.
- రుబ్బిన పేపర్ మిశ్రమానికి 150 గ్రాముల బంక కలపాలి.
- బంక కలిపిన మిశ్రమాన్ని ఒక రోజు వరకు ఉంచాలి. మరుసటి రోజు అది చపాతీ పిండి లేదా చట్నీలా తయారవుతుంది.
- దానికి వైటనింగ్ పౌడర్ కలపాలి.
- పిండిలా తయారైన మిశ్రమం నుంచి చపాతీలను తయారు చేయాలి. వాటిని

● ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో అనర్థాలు
● మట్టి గణపతులనే పూజించాలంటున్న పర్యావరణ ప్రేమికులు

గణేషుడి మట్టి ఆకారాలపై వేయాలి. ఇలా రెండు లేదా మూడు పొరలుగా కల్పి దానికి అలాగే ఆరనివ్వాలి.



- ఆరిన తర్వాత ఆ పొరను నెమ్మదిగా లాగాలి. మనకు కావాల్సిన గణేషుడి ప్రతిమ వస్తుంది.
- దీనిని ఉప్పు కాగితంతో నునుపు వచ్చేలా రుద్దాలి.
- దానికి కళ్లు, కనుబొమ్మలు తిలకం దిద్దడానికి కుంకుమ, పసుపు, వాటర్ రంగులు ఉపయోగించాలి.

● ముంబైలో నిషేధం

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో గణేష్ ప్రతిమల తయారీని ముంబై హైకోర్టు నిషేధించింది. 2011 ఫిబ్రవరి 8న ఔరంగాబాద్ బెంచ్ తీర్పును అనుసరించి ముంబైలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను పూర్తిగా నిషేధించారు. దీంతో అందరూ మట్టితో చేసిన గణేష్ విగ్రహాలనే వాడేందుకు ఆసక్తిచూపుతున్నారు.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో పర్యావరణ కాలుష్యం తలెత్తుతున్నందున ప్రజలంతా ప్రస్తుతం మట్టి గణపతులవైపు చూస్తున్నారు. కానీ చిన్నాచితాకా ప్రతిమలు కాకుండా ఓ మోస్తారు సైజు విగ్రహాల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. భక్తుల ఆకాంక్షకు అనుగుణంగా మట్టి విగ్రహాల తయారీనే ఉపాధిగా మలుచుకున్నాడు ఓ యువకుడు. గత 15 ఏళ్లుగా పర్యావరణ హిత గణపతులను రూపొందిస్తూ పలువురి మన్ననలు అందుకుంటున్నాడు.

◆ మందమర్రి

మట్టి గణపతుల తయారీలో మేటి..!

- ఉపాధిగా మలుచుకున్న యువకుడు
- అతి తక్కువ ధరకే అందుబాటులో

కాగజ్‌నగర్‌కు చెందిన సందిత్ కేశవ్, మట్టి విగ్రహాల తయారీలో ఆరితేరాడు. సుమారు 15 ఏళ్లుగా మంద మర్రి లోని దుర్గామాత ఆలయం సమీపంలో మట్టి విగ్రహాలు తయారుచేస్తూ అతి తక్కువ ధరలకే విక్రయిస్తున్నాడు. ప్రస్తుతం గరిష్ఠంగా 8 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలు తయారుచేస్తుండగా, ఆర్డర్ ఇస్తే 20 అడుగుల వరకైనా రూపొందిస్తానని కేశవ్ చెబుతున్నాడు. ఇక్కడ కేవలం రూ.3 వేల నుంచే విగ్రహాలు లభిస్తుండగా, మందమర్రి ప్రాంతంలో చాలా మంది కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు ఇక్కడికి వచ్చి, విగ్రహాల తయారీని ప్రత్యక్షంగా పరిశీలించారు. కేశవ్‌ను ప్రశంసించడమే గాక ఇలాంటి కళాకారులకే చేయూతనిస్తానని హామీ ఇచ్చారు.



● ఎంతో ఆకర్షణీయంగా..

కేశవ్ ఒక సహాయకుడిని నియమించుకొని అత్యంత ఆకర్షణీయంగా విగ్రహాలు రూపొందిస్తున్నాడు. వీరు తయారు చేసిన మట్టి వినాయకులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను తలదన్నేలా ఉంటున్నాయి. చెబితే తప్ప అవి మట్టివిగ్ర హాలు అని తెలియవంటే అతిశ యోక్తి కాదు. వరిగడ్డి, బంకమన్ను, సహజ రంగులను మాత్రమే వాడుతున్నట్లు కేశవ్ చెప్పాడు. పర్యావరణ పరిరక్షణకే తానీ ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నాడు. వీటిని చెరువుల్లో నిమజ్జనం చేసిన వెంటనే కరిగి మట్టిగా మారుతాయనీ, తద్వారా జలచరాలకు ఎలాంటి ముప్పు ఉండదని హామీ ఇస్తున్నాడు. రానున్న విజయ దశమి సందర్భంగా దుర్గామాత విగ్రహాలను కూడా తయారుచేసేందుకు సిద్ధమవుతున్నట్లు కేశవ్ తెలిపాడు.



మట్టి వినాయక విగ్రహాలను తయారు చేస్తున్న సందిత్ కేశవ్

సహజ రంగుల తయారీ ఇలా..

సహజసిద్ధమైన రంగుల తయారీ చాలా తేలికైన పని. వీటికి అవసరమైన వస్తువులు ప్రకృతిలో చాలా విరివిగా లభిస్తాయి. పసుపు, కుంకుమలకు కాస్త బియ్యపు పిండి కలుపుకొని చల్లుకుంటే మంచిది.

పసుపు	: బంతి పువ్వు
నారింజ రంగు	: జాఫ్ర గింజలు
నీలి రంగు	: నీలి మొక్కలు
ఆకుపచ్చ	: గుంట గన్నేరు ఆకు
ఎరుపు	: గోగుపువ్వు
పోక రంగు	: మద్ది చెట్టు



మట్టి విగ్రహాలనే పూజించాలి

- శివాజీ, ఎన్‌జీసీ, భైంసా డివిజన్ ప్రతినిధి

మట్టితో తయారు చేసిన విగ్రహాలనే పూజించాలి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను పూజించడం మన సంస్కృతి కాదు. చెరువుల్లో రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసి విగ్రహాలను నిమజ్జనం చేయడం ద్వారా అనేక ప్రమాదాలున్నాయి. నేల పైపొరపై పూడుకుపోయి నీరు భూమిలోకి ఇంకదు. విగ్రహాల్లో ఉండే ఇనుప చువ్వలు నీటి ధారలను అడ్డుకుంటాయి. జలచరాలు విషపదార్థాలు తిని మృత్యువాతపడుతాయి. తద్వారా పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుంది.



కాగజ్‌నగర్ గంగపుత్ర కాలనీలో ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న స్థానికులు

కాగజ్‌నగర్‌ను ఆనుకొని ఉండే గంగపుత్ర కాలనీ పరిస్థితి, 'నీరూ లేదు.. దారీ లేదు..' అన్నట్లుగా తయారైంది. పట్టణంతో కలిసి ఉన్నప్పటికీ కోసిని పంచాయతీ పరిధిలోకి రావడం కాలనీవాసుల పాలిట శాపంగా మారింది. నల్లా కనెక్షన్ కాదు కదా, కనీసం బోరు కూడా లేకపోవడంతో ఇక్కడి ప్రజలను ఏడాదంతా నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. వర్షపు నీటిని డ్రమ్ముల్లో పట్టుకొని రోజువారీ కార్యకలాపాలు నిర్వహించుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది. ఇక కాలనీకి వెళ్లే దారి, అడుగుతీసి అడుగువేయలేనంత అధ్వానంగా మారింది.

◆ కాగజ్‌నగర్

నీరూ లేదు.. దారీ లేదు!

- కాగజ్‌నగర్‌లోని గంగపుత్రకాలనీ దుస్థితి
- పట్టణాన్ని ఆనుకొని ఉన్నా పంచాయతీ పరిధిలోకి
- బోరు, నల్లా సహా కనీస ఆధారం కరువు
- ఏడాదంతా తాగునీటి కష్టాలు
- వర్షపు నీటితో దైనందిన కార్యకలాపాలు

కాగజ్‌నగర్ పట్టణాన్ని ఆనుకొని ఉన్న గంగపుత్ర కాలనీ మండలంలోని కోసిని పరిధిలోకి వస్తుంది. ఈ కాలనీలో 100 మంది నివసిస్తున్నారు. కానీ ప్రత్యేకంగా రహదారి సౌకర్యం లేదు. ఉన్న మట్టి రోడ్డు కాస్తా చినుకుపడితే చిత్తడవుతున్నది. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా జారిపడడం ఖాయం. ఇప్పటికే అనేక సార్లు ద్విచక్రవాహనాలు కింద పడి పలువురు



కాగజ్‌నగర్‌లోని గంగపుత్ర కాలనీ

గాయపడ్డారు. ఈ కాలనీకంటూ ఎలాంటి తాగు నీటి సౌకర్యం లేదు. ఎన్ని బోర్లు వేసినా నీళ్లు పడడం లేదు. కాగజ్‌నగర్‌కు సంబంధించిన ప్రధాన పైపులైన్ గతంలో ఈ కాలనీ నుంచే వెళ్లేది. అప్పుడు ప్రత్యేకంగా నల్లా కనెక్షన్ ఇచ్చారు. ఏడాది క్రితం కొత్తపైపులైన్ నిర్మాణం వల్ల దారిమళ్లించారు. దీంతో అప్పటి నుంచి కాలనీవాసులకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఈ విషయమై ఎమ్మెల్యే కోనేరు కోనప్పను, మున్సిపల్ ఛైర్‌పర్సన్ సీపీ విద్యావతిని కలిసి విన్నవించారు. దీంతో వారంలో రెండు సార్లు ట్యాంకర్ ద్వారా నీరు పంపే ఏర్పాట్లు చేశారు. కాలనీవాసులకు ప్రస్తుతం ఈ నీరే దిక్కవుతున్నది. వర్షాకాలంలో ఇంటి మీద పడ్డ వర్షపు నీటిని డ్రమ్ముల్లో పట్టుకొని వాడుకుంటున్నారు. కాలనీలో ప్రత్యేకంగా ఎలాంటి వీధి లైట్లు లేవు. దీంతో రాత్రి వేళ బయటకు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తున్నది.

● విన్నపాలు బుట్టదాఖలు..

తమ కాలనీలో ప్రత్యేకంగా తాగునీటి ట్యాంకు ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు, నాయకులు వినతిపత్రాలు అందజేసినప్పటికీ బుట్టదాఖలవుతున్నాయని ఇక్కడి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు, వీధి దీపాల ఏర్పాటు విషయాన్నీ పట్టించుకోకపోవడంతో నిత్యం నరకం అనుభవిస్తున్నామని వాపోతున్నారు.



గంగపుత్ర గ్రామానికి వెళ్లే దారి

మా కష్టాలు పగోడికి కూడా రావద్దు..

-కుమార స్వామి, గంగపుత్ర కాలనీవాసి

మేము పడుతున్న కష్టాలు పగోడికి కూడా రావద్దు. తాగేందుకు నీటి సౌకర్యం లేదు. బోర్ వేసుకుందామంటే నీరు వస్తుందన్న ఆశ లేదు. రాత్రి వేళల్లో వీధిదీపాలు లేక నరకం కనిపిస్తోంది. రోడ్డంతా బురదమయంగా ఉంటున్నది. కాలు తీసి కాలు వేస్తే జారిపడే ప్రమాదముంది. అత్యంత దుర్భర పరిస్థితుల్లో కాలం వెళ్లదీస్తున్నాం. పట్టణంలోనే ఉన్నా మండల పరిధిలోకి రావడం వల్ల సమస్యలు పరిష్కారం కావడం లేదు.



వర్షపు నీటిని డ్రమ్ముల్లో నింపుకుంటున్నాం

-త్రివేణి, గంగపుత్ర కాలనీ వాసి

వర్షం కురిసిందంటే మా కాలనీవాసులంతా డ్రమ్ముల్లో నింపుకొని వాడుకుంటున్నాం. ట్యాంకర్ నీటిని కేవలం తాగేందుకు ఉపయోగిస్తున్నాం. ఆ ట్యాంకర్ కూడా వారంలో కేవలం రెండురోజులే వస్తున్నది. రెండు బిందెలు దొరకడం మహా కష్టమవుతున్నది. ఇక ఎండాకాలంలో మా బాధ వర్ణనాతీతం. ఇప్పటికైనా అధికారులు స్పందించి, మా సమస్యలు పరిష్కరించాలి.



పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు..

-మానస, గంగపుత్ర కాలనీ వాసి

మేము కాగజ్‌నగర్‌లోనే ఉన్నట్టు. కానీ కోసిని గ్రామ పంచాయతీ పరిధిలోకి రావడం వల్ల ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయి. గ్రామపంచాయతీ అధికారులకు చెబితే మా సమస్యలు పరిష్కారం కావడం లేదు. రోడ్డు లేదు. వీధీ దీపాలు లేవు. చాలా కష్టంగా ఉంది. ఏడాది నుంచి నీటి సమస్య ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి, కనీసం తాగునీటి సమస్యను పరిష్కరించాలి.



టంగ్ ట్విస్టర్స్

1. Farrell's features fablous food 'n' fantastic fountain fantasies for frolicking, fun-filled festive families.
2. Thomas Tattamus took two T's to tie two tots to two tall trees.
3. The Final Fixing of the Foolish Fugitive

సూక్తి

మానవుడు ఎంత
గొప్పవాడు అయితే..
అంత కఠినమైన పరీక్షలు
దాటవలసి ఉంటుంది.

నవ్వుల్ నవ్వుల్

సాంబా : వాస్తు తెలిసిన డాక్టరు దగ్గరకు వెళ్లడం తప్పైపోయింది.
లింగం : ఏమన్నాడేంటి?
సాంబా : వాస్తు బాగాలేదు. గుండె వేరే ప్రదేశానికి మార్చమంటున్నాడు.
లింగం : !!!!!!!!

ముళ్లతో ఉండే గులాబీలు ఎవరికి ఏ హానీ చేయవు.. బురదలో పుట్టే కమలం సుగంధ పరిమళాల్నే వెదజల్లుతుంది. కానీ విషపూరితమైన పువ్వులను, చెట్లను చూశారా? ఆ చెట్లను ముట్టుకున్నా, వాటి గాలి పీల్చినా ప్రాణాలు పోవాల్సిందే. అలాంటి విష పూరిత చెట్లతో ఇంగ్లాండ్‌లో 'పాయిజన్' అనే ఓ పూదోట ఉంది. ఆ విశేషాలు..



పాయిజన్ ప్లాంట్స్

